మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 18-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 169 Issue: 169

18 డిసెంబర్ 2025 - గురువారం, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం - హేమంత ఋతువు, మార్గశిర మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:43, సూర్యాస్తమయం - సా. 5:41, , తిథిః, చతుర్దశి తె. 4:58ం వరకు, తరువాత అమావాస్య, సంస్కృత వారం, బృహస్పతి వాసరః, నక్షత్రం, అనురాధ రా. 7:58 వరకు, తరువాత జ్యేష్ఠ, యోగం, ధృతి మ. 3:01 వరకు, కరణం, విష్టి మ. 3:46 వరకు, శకుని తె. 4:58ం వరకు, వర్జ్యం, రా. 2:20 నుండి తె. 4:07 వరకు, దుర్ముహూర్తం, ఉ. 10:23 నుండి ఉ. 11:06 వరకు, మ. 2:46 నుండి మ. 3:29 వరకు, రాహుకాలం, మ. 1:34 నుండి మ. 2:57 వరకు, యమగండం, ఉ. 6:43 నుండి ఉ. 8:06 వరకు, గుళికాకాలం, ఉ. 9:28 నుండి ఉ. 10:50 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 5:07 నుండి తె. 5:55 వరకు, అమృత ఘడియలు, ఉ. 8:25 నుండి ఉ. 10:13 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:50 నుండి మ. 12:34 వరకు, గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published From Jagitial
www.evarthalu.com





# సుద్దపూసలు!

## ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు ఆధారాల్లేవ్

### స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టీకరణ..అనర్హత పిటిషన్లు కొట్టివేత

### నేడు మరో ముగ్గురి అనర్హత పిటిషన్లపై తీర్పు

ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం ప్రకటించారు. మొత్తం 10 ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డారని బీఆర్ఎస్ అనర్హత పిటిషన్‌లు దాఖలు చేసింది.

అయితే ఐదుగురు ఎమ్మెల్యేలు (అరికెపూడి గాంధీ, తెల్లం వెంకటరావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి)లపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్ కుమార్ బుధవారం (డిసెంబర్ 17) తన నిర్ణయాన్ని వెలువరించారు. ఐదుగురు ఎమ్మెల్యేలు వేరే పార్టీ (కాంగ్రెస్)లో చేరినట్లు ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొంటూ, వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్‌లపై వచ్చిన ఫిరాయింపు ఆరోపణలను తోసిపుచ్చారు. ఫిరాయింపులపై ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. దీంతో ఆ ఐదుగురు ఎమ్మెల్యేలకు ఉపశమనం లభించింది. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. బుధవారం ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈరోజు తీర్పు వెలువరించారు. మరో ముగ్గురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌లకు సంబంధించి దాఖలైన అనర్హత పిటిషన్లపై తీర్పు గురువారం వెలువడనుంది. అయితే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి సంబంధించిన విచారణ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉంది.

**నేను కాంగ్రెస్‌లో చేరలేదు: కడియం**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. స్పీకర్ నోటీసులపై బుధవారం లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ సభ్యత్వం రద్దుచేసుకోలేదని

మొదటిపేజీ తరువాయి...

# ప్రజాస్వామ్యం ఖూనీ



## అసెంబ్లీ సాక్షిగా రాజ్యాంగంపై దాడి

### ఉపఎన్నికలకు భయపడే అనర్హత వేటు వేయడం లేదు

### తండ్రి తెచ్చిన చట్టానే గౌరవించలేని అమర్థుడు రాహుల్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్పీకర్ నిర్ణయంపై స్పందిస్తూ దేశ అత్యున్నత న్యాయ స్థానాలపైనే కాదు, చివరికి రాజ్యాంగంపై కూడా రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని విమర్శించారు.

కేవలం ఫోటోలకు ఫోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.'సొంత తండ్రి రాజీవ్ గాంధీ తెచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టాన్నే గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్ గాంధీ చరిత్రలో మిగిలిపోతారు.



హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేకసార్లు బాహాటంగా ప్రకటించినా, వారిని కాపాడటం రాహుల్ గాంధీ, మరియు కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పంచాయతీ ఎన్నికల వేళ పల్లెపల్లెనా ప్రజావ్యతిరేకత వెల్లువెత్తుతోందని, ఆ భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికలు అంటే జంకుతోందని కేటీఆర్ అన్నారు. అందుకే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని...తెలంగాణ సమాజానికి ఈ విషయం స్పష్టంగా అర్థమైపోయిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి మరీ సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులకు తెరతీసిన నాటి నుంచి... నేటి స్పీకర్ నిర్ణయం వరకు కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అపహాస్యం చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒత్తిడికి మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం గౌరవ సుప్రీంకోర్టు చెప్పిన తీర్పుల స్ఫూర్తిని పట్టించుకోకుండా, కేవలం ఇక్కడి కాంగ్రెస్ పార్టీ ఒత్తిడికి తలొగ్గి స్పీకర్ నిర్ణయం తీసుకోవడంపై కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్పీకర్ పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని అందులోని నిబంధనలను పట్టించుకోకుండా, ప్రజాస్వామ్య విరుద్ధంగా రాజ్యాంగ విరుద్ధంగా స్పీకర్ వ్యవహరించారన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని టిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని కేటీఆర్ తెలిపారు. సాంకేతికంగా అడ్డుపెట్టుకుని గోడ దూకిన ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ సంబరపడినా, ప్రజాక్షేత్రంలో వారిని ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో అనర్హులుగా ప్రకటించేశారని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ: హరీశ్ రావు**

బీఆర్ఎస్ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్‌లోకి ఫిరాయింపు చర్యలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని

మొదటిపేజీ తరువాయి...


## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,451 |
| వెండి (గ్రాము): | రూ.222 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,505 |

# సర్పంచులు రెడీ.. పరిషత్తుకు రె'ఢీ'!




రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సమరం ముగిసింది. మొత్తం మూడు దశల్లో పోలింగ్ జరుగగా బుధవారం తుది దశ పూర్తయింది. మొదటి రెండు దశల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు కైవసం చేసుకోగా, చివరి దశలోనూ అదే రిజల్ట్ రిపీట్ అయ్యింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం అవుతోంది. తాజాగా ఎన్నికల సంఘం రిజర్వేషన్ల డ్రాఫ్ట్ లిస్ట్ ను ప్రభుత్వానికి అందించింది.

హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): రెండు విడతలుగా ఎన్నికలను నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ప్రభుత్వం ఆమోదిస్తే ఈ నెల 25న మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈనెల 20 నుంచి రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. పంచాయతీ ఎన్నికల తరహాలోనే 50శాతం లోపు రిజర్వేషన్లు ఖరారు చేసి మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ హస్తగతమైన నేపథ్యంలో అదే ఊపులో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను పూర్తి చేయాలని భావిస్తుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెల 23, 27 తేదీల్లో విడుదల చేసేందుకు ఎన్నికల సంఘానికి ప్రభుత్వం సమాచారం అందించవచ్చని తెలుస్తుంది. ఇప్పటికే సిద్ధం చేసిన ఓటర్ల జాబితా, మండల,

మొదటిపేజీ తరువాయి...

# జీఎస్టీ 2.0తో 47,000 కోట్ల నష్టం




న్యూఢిల్లీ: కేంద్రం అమలు చేసిన వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) 2.0 సంస్కరణల కారణంగా ప్రభుత్వానికి సుమారు రూ. 47,000 కోట్ల ఆదాయ నష్టం ఏర్పడనుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. ఇటీవల పార్లమెంటులో అడిగిన ప్రశనలకు సమాధానమిచ్చిన మంత్రిత్వ

మొదటిపేజీ తరువాయి...

## విశ్వవాణి



జమాల్ అల్ నాదక్ అనే దుబాయ్ బిజినెస్ మ్యాన్ తన భార్య కోసం రూ.452 కోట్లు పెట్టి ప్రైవేట్ ఐలాండ్‌ను కొనుగోలు చేశాడు. కేవలం ఆమె బికినీ వేసుకొని ఐలాండ్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా తిరగాలనే ఉద్దేశంతోనే తాను ఈ ఐలాండ్‌ను కొన్నట్లు పేర్కొన్నాడు.




# రాష్ట్రపతికి ఘన స్వాగతం

### హైదరాబాద్ చేరుకున్న ముర్ము

### ఐదు రోజులు బస ఇక్కడే

### 22న సాయంత్రం మళ్లీ హస్తినకు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది నిమిత్తం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ రోజు మధ్యాహ్నం ప్రత్యేక విమానం ద్వారా రాష్ట్రపతి ముర్ము హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): రాష్ట్రపతి ముర్ముకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, సీతక్క ఘనస్వాగతం పలికారు. ముర్ము అక్కడి నుండి నేరుగా సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈ విడిదిలో భాగంగా ఆమె మొత్తం ఐదు రోజుల పాటు ఇక్కడే బస

మొదటిపేజీ తరువాయి...

# 22న సర్పంచుల ప్రమాణం

### 20న మంచి ముహూర్తం లేదని వాయిదా

రాష్ట్రం గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలిచిన నూతన సర్పంచ్ ల పదవీ బాధ్యతల స్వీకరణ(అపాయింట్ మెంట్ డే) తేదీలో పంచాయతీ రాజ్ శాఖ తాజాగా మార్పు చేసింది.




# అధిక లగేజీకి పన్ను రైల్వేశాఖ కొత్త బాదుడు



న్యూఢిల్లీ: రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లలో అధిక లగేజీపై పన్ను విధించింది. పరిమితి దాటితే అదనపు చార్జీలు విధించాలని నిర్ణయం తీసుకుంది. ఏసీ స్లీపర్ త్రీటైర్‌లో 40 కిలోల వరకే అనుమతి ఇచ్చారు. జనరల్ బోగీలో 35 కిలోల లగేజీ వరకు అనుమతి ఇచ్చారు. ఏసీ ఫస్ట్ క్లాస్‌లో 70 కిలోలకు అవకాశం

మొదటిపేజీ తరువాయి...

# మన ఆధార్ వివరాలు సేఫ్

## పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటన




న్యూఢిల్లీ: దేశంలోని 134 కోట్ల మంది ఆధార వివరాలు సేఫ్‌గానే ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం తెలిపారు. ఉడాయ్ డేటాబేస్ నుంచి ఆధార్‌కార్డు హెూల్డర్ల సమాచారం ఎలాంటి దుర్వినియోగానికి గురికాలేదని

మొదటిపేజీ తరువాయి...

## రాశి ఫలాలు

18-12-2025

మేషం: ఉద్యోగస్తులకు అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. అప్పుల నుండి అరుదైన శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కొన్ని పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

వృషభం: చిన్ననాటి మిత్రులతో వివాదాలు తప్పవు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. దైవానుగ్రహం తో కొన్ని పనులు పూర్తి చేయగలుగుతారు. ఇంటా బయట సమస్యలు ఉన్నప్పటికీ అధిగమించి ముందుకు సాగుతారు.

మిధునం: ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి విమర్శలు తప్పవు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

కర్కాటకం: జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

సింహం: మిత్రుల నుండి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. స్నేహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాల విస్తరణకు భాగస్తులు నుండి సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

కన్య: దూరప్రయాణాలు వీలైనంత వరకు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. రుణదాతల ఒత్తిడి అధికమవుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. కీలక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా చికాకు పరుస్తుంది.

తుల: వ్యాపార ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించడం మంచిది. ధన వ్యవహారాలలో కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: ఉద్యోగస్తులకు మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. శుభకార్యాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపారాలు లాభాలాబాట పడుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. వివాదాలకు సంబంధించి ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. విలువైన వస్త్రా ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

ధనస్సు: అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉండదు. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

మకరం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున పరిస్థితులు అనుకూలిస్తాయి. ఆస్తి వివాదాలు పరిష్కారదిశగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలిస్తాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

కుంభం: వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో కలహా సూచనలున్నవి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ముఖ్యమైన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

మీనం: విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. చిన్ననాటి మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. వ్యాపార, ఉద్యోగాలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. బంధువుల కలయిక ఉత్సాహాన్నిస్తుంది.







# సుద్దపూసలు!

మొదటి పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరతానని తాను ఎక్కడా ప్రకటించలేదని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదు అని తెలిపారు. కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కడియం శ్రీహరి వెల్లడించారు. కడియం వివరణపై స్పీకర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

**వేచి వేచి.. వేటు వేయలేక!**

పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై స్పీకర్ ఎలాంటి విచారణ జరుపకుండా నెలలపాటు సాగదీసిన సంగతి తెలిసిందే. దీంతో కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సాగదీతపై సుప్రీంకోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. స్పీకర్‌పై పలు వ్యాఖ్యలు చేసింది. మూడు నెలల్లో తేల్చాలని, జూలై 31న సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 21తో గడువు ముగిసినా, తేల్చకపోవడంపై మండిపడింది. స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అంతేకాదు నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని గత నెల 17న తుది గడువు విధించింది. 'స్పీకర్ చర్యలు కోర్టు ధిక్కారమే. నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోండి. లేదా నూతన సంవత్సరం వేడుకలు ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో ఈ నెల 18వ తేదీ (గురువారం)లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోకుంటే స్పీకర్ కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉండటంతో హడావుడిగా తీర్పు వెలువరించారు. కాగా, ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చామని, మిగిలిన పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని సుప్రీంకోర్టును స్పీకర్ కోరే అవకాశం ఉన్నదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

## జీఎస్టీ 2.0తో 47,000 కోట్ల నష్టం

మొదటి పేజీ తరువాయి

శాఖ.. విస్తృతంగా రేట్ల తగ్గింపు వల్ల స్థూలంగా రాబడిపై రూ. 93,300 కోట్ల వరకు ప్రభావం ఉంటుందని అంచనా వేశామని, కొన్ని వస్తువులను 28 శాతం శ్లాబ్ నుంచి 40 శాతానికి మార్చడం వల్ల రూ. 45,570 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నాం. దీనివల్ల మొత్తంగా జీఎస్టీ రేట్ల సంస్కరణల ప్రభావం రూ. 47,700 కోట్ల నష్టానికి పరిమితం అవుతుందని అభిప్రాయపడింది. అయితే, ఈ అంచనాలు కూడా కచ్చితమని చెప్పలేమని స్పష్టం చేసింది. పన్ను వసూళ్లు స్థిరంగా ఉండవు, వృద్ధి ఉంటుంది. అంతేకాకుండా, తక్కువ రేట్ల వల్ల మెరుగైన పన్నుల చెల్లింపులు, తక్కువ సవాళ్లు ఉండే అవకాశం ఉందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## అధిక లగేజీకి పన్ను

మొదటి పేజీ తరువాయి

కల్పించారు. కాగా, దేశంలో ప్రతిరోజూ కోట్ల మంది ప్రయాణికులు రైలులో ప్రయాణిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ పలు ఏర్పాట్లు చేస్తోంది. రైలులో ప్రయాణించే ప్రయాణికులకు లగేజీ తప్పకుండా ఉంటుంది. అయితే రైలులో తీసుకెళ్లే లగేజీపై పరిమితులు విధించడంతో ప్రయాణికులకు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికుల సంఖ్య కంటే లగేజీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో లగేజీ పరిమితిని రైల్వేశాఖ నిర్ణయించింది. రెండ్రోజుల క్రితం ఓ రైల్వే అధికారి దీనిపై మాట్లాడుతూ.. ప్రయాణికులు చాలా లగేజీలతో స్టేషన్‌లకు వస్తున్నారని, దీంతో ఒక్కోసారి రైలు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీనిని నివారించేందుకు.. లగేజీపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.

## మన ఆధార్ వివరాలు సేఫ్

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్‌లో సుమారు 134 కోట్ల మంది నమోదు చేసుకున్నారని, ఇప్పటివరకు 16 వేల కోట్లకు పైగా అథంటికేషన్ లావాదేవీలు జరిగాయని తెలిపారు. ఆధార్ డేటా భద్రత కోసం ఉడాయ్ మల్టీ లెవెల్ 'డిఫెన్స్ ఇన్ డెప్త్' విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు. డేటా ట్రాన్స్ఫర్, స్టోరేజి సమయంలో ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ పర్యవేక్షణతో పాటు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ వ్యవస్థను నిరంతరం పరిశీలిస్తున్నాయని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

## సర్పంచులు రెడీ.. పరిషత్తుకు రె'ఢీ'!

మొదటి పేజీ తరువాయి

జడ్పీటీసీల లెక్కలు, రిజర్వేషన్లు ప్రభుత్వం వద్ద ఉండడంతో ఇక ఎన్నికలకు వెళ్లడమే తరువాయి అని చెబుతున్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సిద్దంగా ఉంది. రాష్ట్రంలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆయా వర్గాల సమాచారం. 2024 జూలై 4న జడ్పీటీసీ, 5న ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక పాలన కొనసాగుతోంది.

## రాష్ట్రపతికి ఘన స్వాగతం

మొదటి పేజీ తరువాయి

చేస్తారు. రాష్ట్రపతి పర్యటనలో భాగంగా అల్వాల్, బొల్లారం ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి తన 5 రోజుల పర్యటనలో పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. డిసెంబర్ 19న రాష్ట్రపతి ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించనున్నారు. అక్కడ జరగనున్న ఆలిండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును ఆమె ప్రారంభించనున్నారు. అనంతరం డిసెంబర్ 20వ తేదీన గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ నిర్వహించే సదస్సులో పాల్గొంటారు. డిసెంబర్ 21న రాష్ట్రపతి నిలయంలో సాధారణ పౌరులతో ఆమె భేటీ, తరువాత ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది పర్యటనను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ వరకు అల్వాల్, గచ్చిబౌలి పరిధిలో డ్రోన్లు, పారా గ్లైడర్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగురవేయడంపై పోలీసులు నిషేధం విధించారు. అదేరోజు సాయంత్రం ప్రత్యేకవిమానంలో ఆమె ఢిల్లీకి బయలుదేరనున్నారు.

# ప్రజాస్వామ్యం ఖూనీ

మొదటి పేజీ తరువాయి



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెల్లడించిన తీర్పుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పరిహాసం చేసిందంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై ఢిల్లీలో ఒక మాట తెలంగాణలో మరోమాట మాట్లాడుతోందని రాజ్యాంగంపై రాహుల్ నినాదం తెలంగాణలో వర్తించదా? అని ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పుతో కాంగ్రెస్ ద్వంద్వ విధానం బట్టబయలైందని చెప్పుకొచ్చారు. ఢిల్లీలో రాజ్యాంగం పరిరక్షణపై మాట్లాడే కాంగ్రెస్ రియల్ ఫేస్ తెలంగాణలో స్పీకర్ తీర్పుతో బయటపడిందంటూ మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థలను కూడా దిగజార్చడం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీ-డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమేనని మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. సేవ్ ది కానిస్టిట్యూషన్ నినాదం మాటలకే పరిమితమై... ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని ఇది ఎంతో సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.

**న్యాయపోరాటం చేస్తాం: కేపీ వివేకానంద**

స్పీకర్ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వెల్లడించారు. అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ తెలంగాణలోని ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చీట్ ఇవ్వడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తన విధులు నిర్వహించడంలో విఫలమయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తీర్పు కాపీ ఇవ్వమని అడిగినా సమాధానం లేదని వాపోయారు. కేవలం ఒక పేరా మాత్రమే తమకు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఆ ఎమ్మెల్యేలు శాసనసభ్యులుగా ఉంటారని మాత్రమే అందులో ఉందని... ఆ ఐదుగురు ఏ పార్టీ తరపున ఎమ్మెల్యేలుగా కొనసాగుతారో స్పీకర్ స్పష్టత ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. వ్యవస్థలపై నమ్మకం తగ్గేలా స్పీకర్ నిర్ణయం ఉందని... దీనిపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పుకొచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చే వరకు స్పీకర్ నిర్ణయం తీసుకోలేకపోయారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు.

## 22న సర్పంచుల ప్రమాణం

హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): రాష్ట్రం గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలిచిన నూతన సర్పంచ్ ల పదవీ బాధ్యతల స్వీకరణ(అపాయింట్ మెంట్ డే) తేదీలో పంచాయతీ రాజ్ శాఖ తాజాగా మార్పు చేసింది. నూతన సర్పంచ్ ల పదవీ బాధ్యతల స్వీకరణ తేదీని డిసెంబర్ 20వ తేదీ నుంచి 22వ తేదీకి వాయిదా వేసింది. అంతకుముందు నూతన సర్పంచ్ లు డిసెంబర్ 20వ తేదీన పదవీ బాధ్యతల స్వీకరించాలని పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే డిసెంబర్ 20న సరైన ముహూర్తాలు లేనందున, ఎన్నికైన ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు పంచాయతీరాజ్ శాఖ డిసెంబర్ 20వ తేదీకి బదులుగా 22వ తేదీని నూతన సర్పంచ్ ల పదవీ బాధ్యతల తేదీగా ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా అదే రోజున నూతన సర్పంచ్ లు పదవీ బాధ్యతలు స్వీకరించాలని పంచాయతీ రాజ్ శాఖ సవరించిన ఉత్తర్వులలో పేర్కొంది.

## ఐపీఎల్‌లోకి ఎంపీ పప్పు యాదవ్ కుమారుడు

కోల్‌కతా: ఐపీఎల్ 2026 సీజన్ కోసం అబుదాబిలో జరిగిన మినీ వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) దూకుడు ప్రదర్శించింది. అత్యధికంగా రూ. 64.30 కోట్ల పర్సుతో బరిలోకి దిగిన కేకేఆర్, మొత్తం 13 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్లలో స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ కుమారుడు సార్థక్ రంజన్ పేరు అందరి దృష్టిని ఆకర్షించింది. ఢిల్లీ తరఫున దేశవాళీ క్రికెట్ ఆడే సార్థక్‌ను కేకేఆర్ రూ. 30 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్‌కు తన కుమారుడు ఎంపికవడంపై పప్పు యాదవ్ సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "అభినందనలు బేటా! మనస్ఫూర్తిగా ఆడు. నీ ప్రతిభతో నీకంటూ ఓ గుర్తింపు తెచ్చుకో. నీ కోరికలు నెరవేర్చుకో. ఇకపై సార్థక్ పేరుతోనే మా గుర్తింపు ఉంటుంది" అని ఎక్స్ లో భావోద్వేగ పోస్ట్ చేశారు. సార్థక్ రంజన్ ఇప్పటివరకు ఢిల్లీ తరఫున 2 ఫస్ట్-క్లాస్, 4 లిస్ట్-ఎ, 5 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఫస్ట్-క్లాస్‌లో 28 పరుగులు, లిస్ట్-ఏలో 105 పరుగులు, టీ20ల్లో 66 పరుగులు చేశాడు.



## మూడోరోజూ నష్టాల బాట

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. మీడియా, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 120.21 పాయింట్లు నష్టపోయి 84,559.65 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 41.55 పాయింట్లు క్షీణించి 25,818.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 25,900%-%26,000 స్థాయిని దాటనంత వరకు అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప కాలంలో 25,700%-%25,750 నిఫ్టీకి కీలక మద్దతు జోన్‌గా ఉందని, ఒకవేళ ఈ స్థాయి కంటే దిగువన ముగిస్తే పతనం మరింత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. మార్కెట్లు బలహీనంగా ఉన్నప్పటికీ కొన్ని ప్రధాన స్టాక్స్ లాభపడ్డాయి. ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టీసీఎస్, టాటా స్టీల్ షేర్లు 1.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి స్టాక్స్ నష్టపోయి సూచీలపై ఒత్తిడి పెంచాయి. బ్రాడర్ మార్కెట్లలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.73 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మీడియా ఇండెక్స్ అత్యధికంగా 1.7 శాతం పతనమైంది. ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ రంగాలు మాత్రం లాభాలతో ముగిశాయి. ఇదిలా ఉండగా, కమొడిటీ మార్కెట్‌లో వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఎంసీఎక్స్‌లో సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సుమారు రూ. 2,05,665 వద్ద ట్రేడ్ అయింది. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యంతో యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కోలుకుని 89.81 వద్ద ముగిసింది.

# ఎమ్మెల్యేలను చేర్చుకున్నది మర్చిపోయారా?

## ఏం జరిగినా విమర్శించడం అలవాటైపోయింది.. బీఆర్ఎస్‌పై విప్ ఆది శ్రీనివాస్ మండిపాటు

వేములవాడ/హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తిప్పికొట్టారు. రాష్ట్రంలో ఏం జరిగినా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం బీఆర్ఎస్‌కు అలవాటైపోయిందన్నారు. “38 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ఫిరాయింపులు బీఆర్ఎస్‌కు గుర్తుకురాలేదా?, ఫిరాయింపు ఎమ్మెల్యేలను మంత్రులను చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. తీర్పు కాపీలు తొందరగా రావు.. ఆ విషయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలియదా?, న్యాయపోరాటం చేసుకొవచ్చు.. మాకు అభ్యంతరం లేదు.” అని తెలిపారు. “ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయానికి అంతా కట్టుబడి ఉండాల్సిందే. సభాపతి ఇరుపక్షాల వాదనలు విని మెరిట్ ఆధారంగా తీర్పు ఇచ్చారు. స్పీకర్‌పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. బీఆర్ఎస్ పార్టీ కూడా ఫిరాయింపులపైన మాట్లాడడం ఆశ్చర్యం. టీడీపీ ఎమ్మెల్యే తలసానిని కేబినెట్‌లోకి తీసుకోవడం మరిచిపోయారా? కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్న విషయం మరిచిపోయారా?, 10 ఏళ్లలో 39 మంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకోవడం మరిచిపోయారా?.” అని నిలదీశారు. “ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే బీఆర్ఎస్ పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. స్పీకర్ తీర్పు పైన బీఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లొచ్చు.. ఇంకా పైకోర్టులకు వెళ్లొచ్చు. తమకు అనుకూలంగా తీర్పు వస్తే ఒక విధంగా.. రాకపోతే మరో విధంగా బీఆర్ఎస్ మాట్లాడుతోంది. స్పీకర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు దశల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. సీఎం రేవంత్ రెడ్డి పైన కూడా కడుపు మంటతో బీఆర్ఎస్ నాయకులు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు. కేసీఆర్‌లా మా సీఎం అప్రజాస్వామికంగా పాలన చేయడం లేదు. పదేళ్లలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. స్పీకర్ తీర్పుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదు. మెస్సీ లాంటి దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు హైదరాబాద్‌కు వచ్చినా ఓర్వలేకపోతున్నారు.” అని ధ్వజమెత్తారు.





## నిరాయుధుల అరెస్టు అక్రమం

### 16 మంది నక్సల్స్ అరెస్ట్‌పై మావోయిస్టు పార్టీ లేఖ

సిర్పూర్, డిసెంబర్ 17 (ఈవార్తలు): ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 16 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయడంపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ అరెస్టులను ఖండిస్తూ కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఓ లేఖను విడుదల చేసింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల సమీపంలో నిరాయుధంగా ఉన్న తమ వారిని అరెస్ట్ చేశారని లేఖలో ఆరోపించింది. ఈ చర్య తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వాతావరణానికి ఎదురుదెబ్బ అని పేర్కొంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఫాసిస్టు బీజేపీ రూపొందించిన ‘కగార్’ యుద్ధానికి మద్దతు ఇవ్వొద్దని ఈ లేఖ ద్వారా మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ‘మావోయిస్టు ముక్త్’, ‘ప్రతిపక్ష ముక్త్’ లక్ష్యాలతో ఈ యుద్ధాన్ని అమలు చేస్తోందని విమర్శించింది. ‘ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ’ వంటి నినాదాలతో దేశంలోని ఇతర పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఎన్నికల కమిషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ సంస్థలను కేంద్రం తన ఆధీనంలో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, దీనికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణ అని లేఖలో పేర్కొంది. బీజేపీ విధానాలు కేవలం కార్పొరేట్లకు మాత్రమే మేలు చేస్తున్నాయని విమర్శించింది. తెలంగాణలో ప్రశాంత వాతావరణం కొనసాగేలా చూసేందుకు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఉపసర్పంచ్

సంగారెడ్డి, డిసెంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఆసక్తికరమైన అంశాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకొని వార్డు మెంబర్‌గా గెలుపొంది, ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం, మల్కాపూర్ గ్రామంలో ఇటీవల సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. ఆ గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. అతని తల్లిదండ్రులు గత 18 సంవత్సరాలుగా గ్రామంలో వివిధ పదవుల్లో కొనసాగారు. వారి అడుగుజాడల్లో నడవాలని భావించిన ప్రవీణ్ కుమార్, తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి వార్డు మెంబర్‌గా పోటీ చేశాడు. వాస్తవానికి అతను సర్పంచ్‌గా పోటీ చేయాలని అనుకున్నాడు. కానీ రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో తన అనుచరుడిని సర్పంచ్‌గా గెలిపించాడు. ప్రవీణ్ వార్డు మెంబర్‌గా గెలిచి ఉపసర్పంచ్ పదవిని సొంతం చేసుకున్నాడు.

## సికింద్రాబాద్ నుంచి ఏపీకి 16 అదనపు రైళ్లు

సికింద్రాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు రైళ్లను నడపాలని నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9 నుంచి 19 మధ్య 16 అదనపు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఈ రైళ్లు సికింద్రాబాద్, వికారాబాద్ నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు వెళతాయని పేర్కొంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఓ ప్రకటన జారీ చేశారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ఒకే రూల్

### ముగ్గురు పోలీస్ కమిషనర్ల కీలక నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రం మొత్తంలో ట్రాఫిక్ నియంత్రణకు ఒకే రూల్ ఉండాలని నిర్ణయించారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల పట్ల ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేశారు. నగరంలో భారీ వాహనాల నో ఎంట్రీకి ఒకే సమయాన్ని ఫిక్స్ చేయబోతున్నారు. హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ఒకేసారి చేపట్టనున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ రాకపోకలపై నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. సింగిల్ ఫోర్స్ లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి, బాధ్యతతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబందనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్ లేకుండా వాహనాలు నడపొద్దని, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పేర్కొన్నారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చున వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన డిపార్ట్‌మెంట్‌లో ఉన్న మనమందరం ముందుగా ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు.

## ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

### స్పీకర్ నిర్ణయంపై మాజీ ఎంపీ వినోద్ ధ్వజం



కరీంనగర్, డిసెంబర్ 17 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ తిరస్కరించడం పట్ల మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్ తీవ్రంగా ఖండించారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. స్వయంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పారని గుర్తుచేశారు. కానీ ఇవాళ స్పీకర్ మాత్రం పార్టీ మారలేదని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. పదో షెడ్యూల్లో రాజ్యాంగ సవరణ చేయాలని.. పార్లమెంట్‌లో వెంటనే పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇవాళ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పుతో సోనియా గాంధీ భర్త రాజీవ్ గాంధీ తెచ్చిన చట్టం పనికిమాలిన చట్టంగా తేల్చారని విమర్శించారు. రాజీవ్ గాంధీ తెచ్చిన పార్టీ ఫిరాయింపుల చట్టం 10వ షెడ్యూల్‌ను పనికిమాలిన చట్టంగా స్పీకర్, ఇదే కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు చెప్పిందన్నారు. పార్టీ ఫిరాయించి, స్పీకర్ దగ్గర పార్టీ ఫిరాయించలేదని చెప్తే సరిపోతుందని ఇవాళ స్పీకర్ ప్రసాద్ తీర్పు ఇచ్చారని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని నీరుగార్చిందని.. పార్టీ ఫిరాయింపుల చట్టం పనికిమాలిన చట్టం కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ చంపేసిందని విమర్శించారు.



## స్పీకర్ తీర్పుపై కోర్టుకు బీఆర్ఎస్

### రాజ్యాంగ విరుద్ధమంటూ కోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటన

### సీఎం ఒత్తిడితోనే స్పీకర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ఆరోపణ

హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ, దీన్ని కోర్టులో సవాల్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ విషయంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె. సంజయ్, కె.పి. వివేకానంద్ మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ తీర్పు ఏకపక్షంగా ఉందని విమర్శించారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే స్పీకర్ ఏకపక్షంగా ఉత్తర్వులు ఇచ్చారని వారు ఆరోపించారు. ఒక ట్రైబ్యునల్ హెడ్‌గా స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమయ్యారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరికి అనుగుణంగానే ఈ తీర్పు వెలువడిందని వారు దుయ్యబట్టారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తరఫున బహిరంగంగా ఎన్నికల ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఆ పది స్థానాలకు కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని సంజయ్ జోస్యం చెప్పారు. స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పందిస్తూ.. “రాజ్యాంగాన్ని కాపాడండి” అనే రాహుల్ గాంధీ నినాదం ఈ తీర్పుతో బట్టబయలైందని ఎద్దేవా చేశారు. ఇది రాజ్యాంగాన్ని కాపాడటం కాదని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో దాన్ని రాజకీయంగా వాడుకోవడమేనని ఆయన ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆధారాలు లేవన్న స్పీకర్ వాదనను బీఆర్ఎస్ పార్టీ తప్పుబట్టింది. సీఎం సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేల ఫోటోలను తమ ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేసింది. తెల్లం వెంకట్ రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలకు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదని, సాంకేతికంగా వారు ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారని స్పీకర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల తీర్పు గురువారం వెలువడే అవకాశం ఉండగా, మిగతా ఇద్దరిపై వారి వివరణ అనంతరం నిర్ణయం తీసుకోనున్నారు.

## కొత్త డిస్కం మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): విద్యుత్‌శాఖలో మరో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ను ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూడో డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం విడుదల చేసింది. వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల నిర్వహణ, అలాగే ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం ఈ డిస్కం ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లతో పాటు ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. దీనివల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వం, సంక్షేమ పథకాల అమలును మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# నేడు చిరు ఫ్యాన్స్ భేటీ



జూబ్లీహిల్స్/హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న కొత్త చిత్రం ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమాను భారీ విజయం దిశగా నడిపించేందుకు అభిమాన సంఘం కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా, అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఒక కీలక సమావేశం జరగనుంది. సినిమా ప్రమోషన్, విడుదల సమయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఈ సమావేశం రేపు (డిసెంబరు 18) ఉదయం 9:09 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ప్రారంభం కానున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. జనవరి 12న విడుదల కానున్న ఈ సినిమాను ప్రతి ఒక్క ప్రేక్షకుడి వద్దకు తీసుకెళ్లి, ఘన విజయాన్ని అందించాలని అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత తరఫున ఒక ప్రకటన విడుదల చేశారు. “ప్రేక్షకులకు వినోదాన్ని అందించడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటల్లో ఆయన ఎంతో హుషారుగా, చార్మింగ్‌గా కనిపించి ఆకట్టుకున్నారు. అభిమానులమంతా కలిసికట్టుగా పనిచేసి ఈ సినిమాకు భారీ విజయాన్ని అందిద్దాం” అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని విషయాలు చర్చించి, సినిమా విజయం కోసం పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. చిరంజీవి ప్రస్తుతం యువ దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్షన్ లో ‘మన శంకర వరప్రసాద్ గారు’ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 24 గంటల్లో వార్డుల లెక్కలు చెప్పాలి

### జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనకు సంబంధించిన జనాభా వివరాలు, అధికారిక మ్యాప్‌ను డివిజన్ల వారీగా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 24 గంటల్లో ఈ వివరాలను అందుబాటులో ఉంచాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. అభ్యంతరాల స్వీకరణను ఆ తర్వాత రెండు రోజుల పాటు స్వీకరించాలని ఆదేశించింది. లంగర్ హౌజ్, శాలిబండ డివిజన్ల పునర్విభజన సరిగ్గా జరగలేదంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎల్.రవిచందర్, ప్రభాకర్ వాదనలు వినిపించారు. భౌగోళిక సరిహద్దులను పరిగణనలోకి తీసుకోకుండా డివిజన్లను పునర్విభజించారని, ఒక డివిజన్ దాని పక్కనున్న మరో డివిజన్ మధ్య జనాభా తేడా 10శాతానికంటే ఎక్కువ ఉండొద్దన్న నిబంధనను పట్టించుకోలేదన్నారు. డివిజన్లకు సంబంధించిన మ్యాప్‌ను కూడా ఇవ్వడంలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వివరాలేవీ లేకుండా ప్రజలు అభ్యంతరాలను ఎలా చెబుతారన్నారు. డివిజన్ల పునర్విభజనపై స్టే ఇవ్వాలని కోరారు. జీహెచ్ఎంసీ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కోర్టుకు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న డివిజన్లు ఇతర నియోజకవర్గాల్లోకి వెళ్లకుండా పునర్విభజన చేసినట్లు ఏజీ తెలిపారు. నిబంధనల మేరకే డివిజన్ల పునర్విభజన చేశామన్నారు. జనాభా, మ్యాప్‌ల వివరాలు అధికారుల వద్ద ఉన్నా.. పరిపాలన దృష్ట్యా వాటిని అధికారిక వెబ్ సైట్‌లో ఉంచలేదన్నారు. వివరాలు లేకపోతే ప్రజలు అభ్యంతరాలు ఎలా చెబుతారని, అధికారులు ఇవ్వకపోతే పిటిషనర్లు వాటిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. డిసెంబర్ 31 లోపు డివిజన్లకు సంబంధించిన జనాభాను సర్దుబాటు చేయాలని కేంద్రం గడువు విధించిందని, ఈ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండాలంటే పిటిషన్లను కొట్టేయాలని ఏజీ వాదించారు. డివిజన్ల పునర్విభజనలో కోర్టులు జోక్యం చేసుకోరాదని ఏజీ వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనలో జనాభా, మ్యాప్ వివరాలను అధికారిక వెబ్ సైట్‌లో 24గంటల్లోపు అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తూ పిటిషన్లపై విచారణ ముగించింది.

## సిరిసిల్ల గులాబీ సంస్థానమే!

### పంచాయతీ ఫలితాలే నిదర్శనం: కేటీఆర్



సిరిసిల్ల, డిసెంబర్ 17 (ఈవార్తలు): తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ తన సత్తా చాటిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 117 గ్రామ పంచాయతీలకు గాను 80కి పైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గం ఫలితాలపై కేటీఆర్ స్పందించారు. గత రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీతో ఉన్న అనుబంధం ఎంత బలమైనదో ఈ ఫలితాలు మరోసారి తెలియజేశాయని ఆయన అన్నారు. ఉద్యమ పార్టీగా ఉన్నా, అధికార పార్టీగా ఉన్నా, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండానే గుండెల్లో పెట్టుకున్నారని ఆయన పేర్కొన్నారు. అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా, బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలు బీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం ఉంచి 80 స్థానాల్లో గెలిపించిన సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

## కాళేశ్వరం మేజర్ గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ విజయం

కాళేశ్వరం, డిసెంబర్ 17 (ఈవార్తలు): కాళేశ్వరం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు తెలిపిన అభ్యర్థి భారీ విజయాన్ని నమోదు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందనే ఆరోపణలున్న నేపథ్యంలో, ఆ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే వాదనలు వినిపించాయి. అయితే, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహదేవ్‌పూర్ మండలం, కాళేశ్వరం మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి వెయ్యికి పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మహదేవ్‌పూర్ మండలంలో కాళేశ్వరంతో పాటు అన్నారం,

## లక్ష మందితో సభ పెడ్తం

### నరేగా పేరు మార్పుపై జగ్గారెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, డిసెంబర్ 17 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని చూస్తోందంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా కేవలం గాంధీ, నెహ్రూలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేస్తున్నారని, వారి పేర్లను చరిత్ర నుంచి చెరిపేయాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బుధవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, బీజేపీ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ, అమిత్ షాలు పుట్టకముందే, 1930లోనే గాంధీజీ ‘రఘుపతి రాఘవ రాజారాం’ అంటూ సత్యాగ్రహం చేశారని జగ్గారెడ్డి గుర్తుచేశారు. ప్రజలను ఏకం చేయడానికి గాంధీ రాముడి పేరు వాడితే, బీజేపీ మాత్రం అదే పేరుతో ప్రజలను విభజిస్తోందని విమర్శించారు. “గాంధీ, నెహ్రూ మీలా క్రిమినల్స్ కాదు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూ 12 ఏళ్లు జైలు జీవితం గడిపారు. అలాంటి వారిపై ఇప్పుడు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు” అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలకు నిరసనగా త్వరలో సంగారెడ్డిలో లక్ష మందితో భారీ నిరసన సభ నిర్వహిస్తామని జగ్గారెడ్డి ప్రకటించారు. మోదీ పాలనలో పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని, రైతులు, యువతను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజలు ఏదో ఒకరోజు రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తారని, అప్పుడు బీజేపీ నేతల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాహుల్ ప్రధాని అయ్యాక ఈడీ, సీబీఐ వంటి సంస్థలు మీ మాట వింటాయా? అని నిలదీశారు. అధికారం శాశ్వతం కాదని, బీజేపీ నేతలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.



## కొండగట్టులో టీటీడీ 100 గదుల నిర్మాణం

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ చొరవతో నిర్ణయం.. హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ జనసేన**

మల్యాల, డిసెంబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టులోని ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వసతి సముదాయం నిర్మాణానికి టీటీడీ నిర్ణయించింది. ఈ నిర్ణయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలంగాణ జనసేన తెలిపింది. ఇందుకుగానూ పవన్‌కు తెలంగాణ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొంది. కాగా, కొండగట్టుతో పవన్‌కు ప్రత్యేక బంధం ఉంది. జనసేనాని ఏ కార్యక్రమం చేపట్టినా, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు చేయడం సెంటిమెంట్. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు కూడా తన ప్రచార సారథి అయిన వారాహి వాహనానికి కూడా కొండగట్టు ఆలయం వద్దే పూజలు నిర్వహించారు.



## దారం ఆదిరెడ్డికి అడ్లూరి సన్మానం

మల్యాల, డిసెంబర్ 17 (ఈవార్తలు): మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామ సర్పంచ్‌గా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి దారం ఆదిరెడ్డిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మాజీమంత్రి జీవన్ రెడ్డి అభినందించారు. ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, సీనియర్ నేత అయిన దారం ఆదిరెడ్డిని సన్మానించారు.




## మేడారం జాతరకు రాజన్న గుడి ముస్తాబు

**భక్తుల కోసం విస్తృత ఏర్పాటు**

వేములవాడ, డిసెంబర్ 17 (ఈవార్తలు): సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు భక్తుల సౌకర్యార్థం కోడె ఉచిత దర్శనం, రూ.100 ప్రత్యేక దర్శనం, రూ.300 అతి శీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. దర్శన క్యూలైన్ల వద్ద అవసరమైన మేరకు వాష్‌రూమ్ సదుపాయాలు కల్పించారు. అలాగే భక్తుల సౌకర్యం కోసం నూతన కళ్యాణకట్ట, భక్తులు స్నానం లు చేయడానికి షవర్సు, తాగునీటి నూతన వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు సిద్ధం అవుతున్నాయి. వీఐపీ రోడ్ మార్గంలో భక్తులను ఆకట్టుకునే విధంగా స్వామి, అమ్మవార్ల డిజైన్లు, ఫొటోలతో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు దర్శనం, తాగునీరు, అలంకరణ విద్యుత్ దీపాలు, పారిశుధ్యం తదితర మౌలిక సౌకర్యాలు కల్పించుటకు సంబంధిత అధికారులు ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి గారు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.

## 82 వేల ఎకరాలను క్లియర్ చేయండి

**22ఏ పరిధి భూములపై**

**కలెక్టర్లకు చంద్రబాబు ఆదేశాలు**

అమరావతి, డిసెంబర్ 17 (ఈవార్తలు): ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూముల కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా పారిశ్రామిక పెట్టుబడులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఏపీఐఐసీకి చెందిన సుమారు 82 వేల ఎకరాల భూమి 22ఏ (నిషేధిత జాబితా) పరిధిలో ఉండటం వల్ల పెట్టుబడులకు ఆటంకంగా మారిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి, ఆ 82 వేల ఎకరాల భూమికి సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి చట్టపరమైన, సాంకేతిక ఇబ్బందులు లేకపోతే, ఆ భూములను 22ఏ పరిధి నుంచి తప్పించేందుకు కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. భూ కేటాయింపుల్లో పర్యాటక రంగానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత ఐటీ కంపెనీలకు కేటాయించాలని చంద్రబాబు సూచించారు. గత 18 నెలల్లో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో రూ.8.55 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, కొన్ని ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణ పనులు కూడా ప్రారంభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. భూ కేటాయింపుల్లో కలెక్టర్లు చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విజయవాడ, విశాఖపట్నంలలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూ కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. విశాఖ, తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, టూరిజం ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు.

## టీడీపీలోకి జగన్ అనుచరుడు

పులివెందుల, డిసెంబర్ 17 (ఈవార్తలు): సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి వలసల బెడద కొనసాగుతోంది. తాజాగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అనుచరుడు, వైసీపీ నేత చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే) తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లిలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. వందలాది మంది వైసీపీ కార్యకర్తలతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముందు వేంపల్లి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డితో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరుగుతున్నప్పటికీ, జగన్ రాజకీయ కంచుకోట అయిన పులివెందులలోనే కీలక నేతలు పార్టీ వీడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామం స్థానికంగా వైసీపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది.

# నిధులెందుకు మిగులుతున్నయ్?


**జనవరి 15లోగా ఖర్చు చేయాలి.. 'పీఎంఏవై-అర్బన్'లో తక్కువ ఖర్చుపై చంద్రబాబు అసంతృప్తి**



అమరావతి, డిసెంబర్ 17 (ఈవార్తలు): కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతిలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో, వివిధ శాఖల వద్ద ఇంకా రూ.6,252 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోవడంపై అధికారులను ఆయన నిలదీశారు. ఈ నిధులన్నింటినీ రాబోయే జనవరి 15వ తేదీలోగా నూటికి నూరు శాతం ఖర్చు చేయాలని గట్టిగా ఆదేశించారు. "ఒకవైపు నిధులు లేక ఇబ్బందులు పడుతుంటే, కేంద్ర పథకాల్లో అందుబాటులో ఉన్న నిధులను కూడా ఖర్చు చేయకపోవడమేంటి?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మొత్తం రూ.24,513 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఇంత పెద్ద మొత్తంలో నిధులు మిగిలిపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) - అర్బన్ పథకం కింద కేవలం 38 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ నిధుల వినియోగాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని మంత్రి కొలుసు పార్థసారథిని ఆదేశించారు. గతంలో విజిలెన్స్ విచారణ కారణంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలకు వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలించాలని, తద్వారా నిధుల ఖర్చును వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా పథకం కింద రూ.1363 కోట్లకు గాను ఇప్పటికే రూ.1259 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన నిధులను కూడా త్వరగా పూర్తి చేస్తామని సీఎంకు వివరించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి రాష్ట్రానికి అదనంగా రూ.1200 కోట్లు కోరినట్లు తెలిపారు. కేంద్రం నుంచి అదనంగా నిధులు రాబట్టుకోవడంపై చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. "జనవరి నాటికి పీఎంఏవై అర్బన్‌లో 75 శాతం నిధులు ఖర్చు చేస్తే అదనంగా నిధులు సాధించవచ్చు. ఈ ఏడాది కేంద్ర పథకాల ద్వారా రూ.30 వేల కోట్ల ఖర్చును లక్ష్యంగా పెట్టుకుందాం. ప్రస్తుతం ఉన్నవి ఖర్చు చేస్తే మరో రూ.5 నుంచి 6 వేల కోట్లు అదనంగా తెచ్చుకోవచ్చు" అని తెలిపారు. కేంద్ర బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ మొదలవుతున్నందున, సంబంధిత కేంద్ర మంత్రులతో టచ్‌లో ఉండాలని, ఏపీకి అదనపు ప్రయోజనాలు చేకూరేలా చూడాలని సూచించారు. ఇదే సమావేశంలో, రాష్ట్రవ్యాప్తంగా 63 వేల ప్రభుత్వ ఖాతాలు నిర్వీర్యంగా (ఇన్ యాక్టివ్) ఉన్నాయని, వాటిలో సుమారు రూ.155 కోట్ల నిధులు ఉండిపోయాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఆ నిధులను వెంటనే విత్‌డ్రా చేయించి, కనీసం వడ్డీ అయినా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని శాఖల ఆడిట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# పీపీపీపై వెనక్కి తగ్గేదేలేదు

**క్లారిటీ ఇచ్చిన చంద్రబాబు**



అమరావతి, డిసెంబర్ 17 (ఈవార్తలు): ఏపీలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించే వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని, వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారంటూ వస్తున్న విమర్శలలో ఎలాంటి వాస్తవం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ప్రారంభమైన ఐదవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీపీపీ విధానంపై పూర్తి స్థాయి స్పష్టత ఇచ్చారు. పీపీపీ ద్వారా వైద్య సేవలను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. "పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నా, అవి ప్రభుత్వ కళాశాలల పేరుతోనే కొనసాగుతాయి. వాటి నిర్వహణ, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. ఈ కళాశాలల్లో 70 శాతం మందికి ఎన్టీఆర్ వైద్య సేవల కింద చికిత్స అందుతుంది. సీట్లు కూడా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం సైతం అనేక ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిలోనే చేపడుతోంది. రోడ్లను పీపీపీ ద్వారా నిర్మిస్తే అవి ప్రైవేటు వ్యక్తులవి అయిపోతాయా? కేవలం విమర్శల కోసం మాట్లాడితే భయపడేది లేదు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది" అని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని చంద్రబాబు విమర్శించారు. "రూ.500 కోట్లతో రుషికొండలో ప్యాలెస్ నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారు. ఆ డబ్బుతో రెండు అత్యాధునిక మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయ్యేది. ఇప్పుడు ఆ ప్యాలెస్ నిర్వహణ ప్రభుత్వానికి పెను భారంగా మారింది. గత ప్రభుత్వంలో జీతాలు కూడా ఇవ్వలేని దయనీయ పరిస్థితులు ఉండేవి. 13 నుంచి 14 శాతం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. అనవసరపు ఖర్చులతో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు" అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో ఆ అప్పులను రీ-షెడ్యూల్ చేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన 70 శాతం ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేసి, కొత్త రోడ్లు నిర్మిస్తున్నామని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. "పేదలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతోనే సూపర్ సిక్స్ పథకాలను తీసుకొచ్చాం. సామాజిక భద్రత పెన్షన్లను ప్రతినెలా ఒకటో తేదీనే అందిస్తున్నాం. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అందరికీ లబ్ధి చేకూరుస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రెండు విడతల్లో రూ.14 వేలు అందించాం. దీపం-2.0, స్త్రీశక్తి పథకాలతో పాటు మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేశాం. డ్వాక్రా, మెప్మా సంఘాలను అనుసంధానం చేసి మహిళలను బలోపేతం చేస్తున్నాం. పెద్దఎత్తున గృహ నిర్మాణాలు చేపట్టి అందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నాం" అని ఆయన వివరించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజలకు ప్రివెంటివ్, క్యురేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్ విధానంలో వైద్యారోగ్యం అందించాలని కలెక్టర్లకు సూచించారు.

# ఒబెరాయ్‌కు 3 వేల కోట్ల టీటీడీ భూమి!

**చంద్రబాబు ప్రభుత్వం స్వామివారికి తీరని ద్రోహం చేసిందన్న భూమన**



తిరుపతి, డిసెంబర్ 17 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వంపైనా, టీటీడీ ఛైర్మన్ పైనా వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తిరుపతిలో అత్యంత విలువైన రూ.3 వేల కోట్ల టీటీడీ భూమిని ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి కట్టబెట్టి, శ్రీ వేంకటేశ్వర స్వామికి తీరని ద్రోహం చేశారని ఆయన విమర్శించారు. ఇది పరకామణి దొంగతనం కన్నా వంద రెట్లు పెద్దదని ఆరోపించారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వంద గదుల హోటల్ కోసం అలిపిరి రోడ్డులోని అత్యంత విలువైన భూమిని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పర్యాటక శాఖ భూమికి బదులుగా టీటీడీ భూమిని బదిలీ చేయడమే కాకుండా, లీజును కూడా మాఫీ చేసి చంద్రబాబు ప్రైవేటు సంస్థకు దోచిపెట్టారని ఆరోపించారు. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ, అది ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)లో కనిపించకుండా ఎందుకు దాస్తున్నారని భూమన నిలదీశారు. దీని వెనుక వేల కోట్ల అవినీతి దాగి ఉందని, చంద్రబాబు, పవన్ కలిసి ఈ భూమిని ప్రైవేటు సంస్థకు అప్పగించారని విమర్శించారు. టీటీడీ భూములను ప్రైవేటుపరం చేయడాన్ని స్వాములు, పీఠాధిపతులు, మఠాధిపతులు తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన కోరారు. తిరుమల భక్తులను చంద్రబాబు ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోందని భూమన కరుణాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికి మాయం చేశారని ఆరోపించారు. ఈ అక్రమంపై అటవీశాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని భూమన ప్రశ్నించారు.



## బొట్ల జయ ప్రసాద్‌కు భోగశ్రావణి శుభాకాంక్షలు

మల్యాల, డిసెంబర్ 17 (ఈవార్తలు): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతిపెద్ద గ్రామపంచాయతీ మల్యాల మండల కేంద్రంలో ఘన విజయం సాధించిన బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బొట్ల జయ ప్రసాద్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, మల్యాల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోడ గోవర్ధన్, తాటిపాముల శ్రీహరి, దూస దేవరాజు, కొక్కుల సుధాకర్, కుర్ర శీను, గుండేడి ఆంజనేయులు, కట్కం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి నుంచి జిల్లాల్లో చంద్రబాబు ఆకస్మిక తనిఖీలు

అమరావతి, డిసెంబర్ 17 (ఈవార్తలు): ప్రజా సమస్యల పరిష్కారంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఏమాత్రం జాప్యం సహించేది లేదని, 'జీరో టాలరెన్స్' విధానంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారుల పనితీరును పరిశీలించేందుకు జనవరి నుంచి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతానని ఆయన హెచ్చరించారు. కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ శాఖలో ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయో విశ్లేషణ చేసి, పాలనను మెరుగుపరచాలన్నారు. గ్రీవెన్సులు తక్కువగా వస్తేనే పాలన బాగున్నట్లు లెక్క అని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే త్రైమాసికానికి 'జీరో గ్రీవెన్సుల'ను లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మురుగు కాలువలను రాబోయే మూడు నెలల్లోగా పూర్తిగా శుభ్రపరిచేందుకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే జలవనరుల శాఖ వెంటనే స్పందించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. నీటి భద్రత గురించి మాట్లాడుతున్న తరుణంలో ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండకూడదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

## నేడు శ్రీవారి మార్చి కోటా టికెట్ల విడుదల

**నేడు ఆర్జిత సేవల టికెట్లు అందుబాటులోకి**

**ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ వరకు నమోదు**

తిరుమల, డిసెంబర్ 17 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం 2026 మార్చి నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను డిసెంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల టికెట్లను ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తారు. భక్తులు ఈ సేవల కోసం రేపటి నుంచి డిసెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు డిసెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవల టికెట్లను కూడా పలు తేదీల్లో విడుదల చేయనున్నారు. డిసెంబర్ 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను అందుబాటులో ఉంచుతారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు. డిసెంబర్ 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఇక రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను డిసెంబర్ 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో వసతి గదుల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ తేదీలను గమనించి, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## టీటీడీకి రూ.1.2 కోట్ల బ్లేడ్లు

**అందించిన వర్టిస్ కంపెనీ**

తిరుమల, డిసెంబర్ 17 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ సంస్థ భారీ విరాళం అందజేసింది. శ్రీవారి భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలో వినియోగించే బ్లేడ్లను ఏడాదికి సరిపడా ఉచితంగా అందించింది. ఈ విరాళం విలువ సుమారు రూ.1.20 కోట్లు కాగా, దీనివల్ల టీటీడీకి ఏటా బ్లేడ్ల కొనుగోలుపై అయ్యే రూ.1.16 కోట్ల వ్యయం ఆదా కానుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ బ్లేడ్ల తయారీ సంస్థ 'వర్టిస్' ఈ విరాళాన్ని అందించింది. సంస్థ డైరెక్టర్ బొడ్డుపల్లి శ్రీధర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి విరాళాన్ని అధికారికంగా అందజేశారు. భక్తుల కోసం ఉపయోగించే 'సిల్వర్ మ్యాక్స్ హాఫ్ బ్లేడ్లను' వారు విరాళంగా ఇచ్చారు.





# ఒమన్ పర్యటనలో ప్రధాని మోదీ

## సైనిక వందనంతో ప్రధానికి స్వాగతం.. వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాలపై చర్చలు

మస్కట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో చివరి అంకానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఒమన్ రాజధాని మస్కట్‌లో అడుగుపెట్టారు. మస్కట్ విమానాశ్రయంలో ఒమన్ ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యద్ షిహాబ్ బిన్ తారిఖ్ అల్ సయిద్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీకి సైనిక వందనంతో గౌరవ స్వాగతం లభించింది. భారత్, ఒమన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతోంది. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్‌తో ప్రధాని మోదీ విస్తృత స్థాయి చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, రక్షణ, భద్రత, సాంకేతికత వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. 2018 తర్వాత ప్రధాని మోదీ ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గతేడాది డిసెంబర్‌లో ఒమన్ సుల్తాన్ భారత్‌లో పర్యటించారు. శతాబ్దాల నాటి సముద్ర వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలతో ఇరు దేశాల బంధం బలపడిందని విదేశాంగ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ ఛటర్జీ తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఇరు దేశాల వ్యాపార ప్రముఖులతో సమావేశమవుతారు. అలాగే, ఒమన్‌లో స్థిరపడిన భారత ప్రవాస సంఘంతో కూడా భేటీ కానున్నారు. ఒమన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఇథియోపియాలో రెండు రోజుల పాటు పర్యటించారు. ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ అలీ.. స్వయంగా కారు నడుపుతూ మోదీని విమానాశ్రయానికి తీసుకెళ్లి వీడ్కోలు పలకడం విశేషం. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'ను కూడా మోదీ అందుకున్నారు.





## గాంధీని రెండోసారి చంపడమే: చిదంబరం

చెన్నై: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది జాతిపితను రెండోసారి హత్య చేయడమేనని ఆయన అభివర్ణించారు. యూపీఏ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పథకం పేరును మార్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్ మిషన్ (రూరల్)' బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన చిదంబరం... "ఇన్నాళ్లూ జవహర్‌లాల్ నెహ్రూను అప్రతిష్ఠపాలు చేసిన బీజేపీ ప్రభుత్వం, ఇప్పుడు మహాత్మా గాంధీని లక్ష్యంగా చేసుకుంది" అని ఆరోపించారు. 2004 బడ్జెట్‌లో ఈ పథకాన్ని తానే ప్రకటించానని గుర్తుచేశారు. "భారతీయుల జ్ఞాపకాల నుంచి గాంధీని చెరిపేయాలని వారు ప్రయత్నిస్తున్నారు. పిల్లలకు గాంధీ గురించి తెలియకూడదు, ప్రజలు ఆయన పేరును స్మరించుకోకూడదు అన్నదే వారి ఉద్దేశం" అని ఆయన విమర్శించారు. ఈ పథకం పేరు మార్పును కాంగ్రెస్ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మొదట ఈ పథకానికి 'పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ పథకం' అని పేరు పెడతారని భావించినప్పటికీ, దానికి భిన్నంగా కొత్త పేరును ప్రతిపాదించడంపై కాంగ్రెస్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్ వంటి ఇతర విపక్షాలు కూడా మండిపడుతున్నాయి. ఇదే సమయంలో బిల్లులకు కేవలం హిందీ పేర్లు పెట్టడంపైనా చిదంబరం స్పందించారు.

# మా తండ్రిని మళ్లీ చూడలేమేమో

**ఇమ్రాన్ ఖాన్ తనయుల ఆవేదన**



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో మానసిక హింసకు గురిచేస్తున్నారని ఆయన కుమారులు కాసిం ఖాన్, సులేమాన్ ఇసా ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. తన తండ్రితో మాట్లాడి చాలా కాలమైందని, జైలులో ఉన్న తమ తండ్రిని మళ్లీ ఎప్పటికీ చూడలేమేమోనని వారు భయాందోళన వ్యక్తం చేశారు. 'స్కై న్యూస్' వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వారు ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్‌ను రెండేళ్లకు పైగా నిర్బంధ గదిలో ఉంచారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి మురుగునీరు ఇస్తున్నారని, హెపటైటిస్‌తో చనిపోతున్న ఖైదీల మధ్య ఆయనను ఉంచారని ఆరోపించారు. తన తండ్రి ఉన్న జైలు గది పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరితోనూ మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఏకాంతంగా ఉంచారని అన్నారు. ఆయనను బయటకు తీసుకురావడానికి ఏ మార్గం కనిపించడం లేదని వాపోయారు. అయినప్పటికీ తమకు నమ్మకం ఉందని వారు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులు దిగజారుతున్నాయని, ఆయన్ను మళ్లీ ఎప్పటికీ చూడలేమేమోననే ఆందోళన ఉందని అన్నారు. ఇమ్రాన్‌ను ఉంచిన జైలు పరిస్థితులు అసహ్యంగా ఉన్నాయని, అతనితో మాట్లాడేందుకు జైలు అధికారులు తమకు అనుమతివ్వడం లేదని ఆరోపించారు. రోజులో ఎక్కువ సేపు తన తండ్రిని నిర్బంధ గదిలోనే ఉంచుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా ఆయన జైలు జీవితం ఉందని వారు పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్ మృతి చెందారంటూ ఇటీవల పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అప్పటి నుంచి ఆయనను కలిసేందుకు కుటుంబ సభ్యులు, ఇమ్రాన్ ఖాన్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిన్న కూడా అడియాలా జైలు ముందు భారీగా నిరసన తెలిపారు. సోదరి ఉజ్మా ఖానుమ్ ఇటీవల ఇమ్రాన్ ఖాన్‌ను కలిశారు. ఆయన జైల్లో సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.

# కర్ణాటక, తెలంగాణనే సైబర్ నేరాలెక్కువ

**మూడేళ్లలో 60 శాతం పెరిగిన సైబర్ నేరాలు**

**ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులే అధికం**



బెంగళూరు/హైదరాబాద్: దేశంలో సైబర్ నేరాలు ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. గడిచిన మూడేళ్లలో సైబర్ క్రైమ్ కేసులు ఏకంగా 60 శాతానికి పైగా పెరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2021లో 52,974గా ఉన్న కేసుల సంఖ్య, 2023 నాటికి 86,420కి చేరినట్లు తెలిపింది. జాతీయ నేర గణాంకాల సంస్థ ( సమాచారం మేరకు ఈ వివరాలను కేంద్ర హోంశాఖ బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఈ గణాంకాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా తెలిపారు. ఆర్థికపరమైన మోసాలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా ఉన్నాయని ఆయన వివరించారు. ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులు 2021లో 14,007 ఉండగా, 2023 నాటికి 39 శాతం పెరుగుదలతో 19,466కి చేరాయి. ఇక చీటింగ్ సంబంధిత సైబర్ నేరాలైతే ఏకంగా 150 శాతానికి పైగా పెరిగి 6,343 నుంచి 16,943కి ఎగబాకాయి. కంప్యూటర్ సంబంధిత నేరాలు కూడా 77.4 శాతం పెరిగాయని తెలిపారు. రాష్ట్రాల వారీగా చూస్తే, సైబర్ నేరాలకు కర్ణాటక హాట్‌స్పాట్‌గా నిలిచింది. 2023లో అక్కడ అత్యధికంగా 21,889 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానంలో 18,236 కేసులతో తెలంగాణ ఉంది. ఉత్తరప్రదేశ్‌లో 10,794 కేసులు నమోదైనట్లు మంత్రి వెల్లడించారు. కేరళలో సైబర్ కేసులు ఐదు రెట్లు పెరగడం గమనార్హం. అక్కడ 2021లో 626 కేసులు నమోదు కాగా, 2023లో 3,295కి చేరాయి. మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ స్టాకింగ్, బెదిరింపులకు సంబంధించి గత ఏడాది 1,305 కేసులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి కూడా బండి సంజయ్ వివరించారు. "సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్" ద్వారా 2021 నుంచి ఇప్పటివరకు రూ.7,130 కోట్లకు పైగా ప్రజల సొమ్మును కాపాడినట్లు చెప్పారు. సైబర్ నేరాలతో సంబంధం ఉన్న 11.14 లక్షల సిమ్ కార్డులు, 2.96 లక్షల ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# మెస్సీకి అనంత్ అంబానీ 11 కోట్ల వాచ్



ముంబై: ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ తన భారత పర్యటనను విజయవంతంగా ముగించాడు. కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, న్యూఢిల్లీ నగరాల్లో పర్యటించిన ఈ అర్జెంటీనా స్టార్, తన టూర్‌లో భాగంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ అనంత్ అంబానీ స్థాపించిన వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 'వంతారా'ను కూడా సందర్శించాడు. ఈ సందర్భంగా అనంత్ అంబానీ, మెస్సీకి అత్యంత అరుదైన, ఖరీదైన వాచ్‌ను బహుమతిగా అందించారు. అనంత్ అంబానీ బహూకరించిన ఈ వాచ్ 'రిచర్డ్ మిల్లే ఆర్ఎం 003-వీ2 జీఎంటీ టూర్‌బిలాన్ ఆసియా ఎడిషన్'. దీని విలువ సుమారు రూ.10.9 కోట్లు. ప్రపంచవ్యాప్తంగా కేవలం 12 యూనిట్లు మాత్రమే తయారు చేయబడిన అత్యంత అరుదైన వాచ్‌లలో ఇది ఒకటి. వంతారాకు వచ్చినప్పుడు మెస్సీ చేతికి ఎలాంటి వాచ్ లేదని, తిరిగి వెళ్లేటప్పుడు ఆయన ఈ కొత్త వాచ్ ధరించి కనిపించడం పలువురు గమనించారు. బిజినెస్ టుడే కథనం ప్రకారం ఈ వాచ్‌లో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. మాన్యువల్-వైండింగ్ టూర్‌బిలాన్ మూవ్‌మెంట్, డ్యూయల్ టైమ్-జోన్ ఇండికేటర్, పవర్-రిజర్వ్, టార్క్ ఇండికేటర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. దీని కేసును ఏరోస్పేస్, ఫార్ములా 1 రేసింగ్‌లో ఉపయోగించే కార్బన్ టీపీటీ మెటీరియల్‌తో తయారు చేశారు. గురుత్వాకర్షణ ప్రభావాన్ని తట్టుకుని కచ్చితమైన సమయాన్ని చూపేలా టూర్‌బిలాన్ టెక్నాలజీని ఇందులో పొందుపరిచారు. ప్రపంచవ్యాప్తంగా బ్రూనై సుల్తాన్ హసనల్ బోల్కియా, ఫార్ములా 1 డ్రైవర్ మిక్ షూమేకర్, ఫెరారీ మాజీ టీమ్ ప్రిన్సిపల్ జీన్ టాడ్ వంటి అతి కొద్దిమంది ప్రముఖుల వద్ద మాత్రమే ఈ ప్రత్యేకమైన వాచ్ ఉంది. ఇప్పుడు ఈ జాబితాలో లియోనెల్ మెస్సీ కూడా చేరాడు.

# ఏఐ బొమ్మను పెళ్లాడిన జపాన్ యువతి!

టోక్యో: సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న వేళ మనుషుల మధ్య సంబంధాలు కూడా వినూత్న రూపం సంతరించుకుంటున్నాయి. జపాన్‌కు చెందిన 32 ఏళ్ల యురినా నోగుచి అనే మహిళ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టించిన ఓ వర్చువల్ క్యారెక్టర్‌ను వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. అచ్చం సంప్రదాయ వివాహంలా తెల్లటి గౌను, కిరీటం ధరించి, తన కాబోయే భర్తగా భావిస్తున్న స్మార్ట్‌ఫోన్‌లోని ఏఐ క్యారెక్టర్ వైపు చూస్తూ ఆమె భావోద్వేగానికి గురైంది. కాల్ సెంటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నోగుచి 'క్లాస్' అనే వీడియో గేమ్ క్యారెక్టర్‌తో మాట్లాడటం ప్రారంభించింది. చాట్‌జీపీటీ సాయంతో ఆ క్యారెక్టర్‌కు తనకిష్టమైన రీతిలో పర్సనాలిటీని రూపొందించుకుంది. క్రమంగా ఆ ఏఐ పాత్రతో ప్రేమలో పడిన ఆమె, అది ప్రపోజ్ చేయడంతో పెళ్లికి అంగీకరించింది. అక్టోబర్‌లో జరిగిన వీరి వివాహ వేడుకలో, నోగుచి అగుమెంటెడ్ రియాలిటీ స్మార్ట్ గ్లాసెస్ ధరించి, టేబుల్‌పై ఉంచిన స్మార్ట్‌ఫోన్‌లోని 'క్లాస్' క్యారెక్టర్‌కు ఉంగరం తొడిగింది. ఏఐ రూపొందించిన పెళ్లి ప్రతిజ్ఞలను ఓ వ్యక్తి చదివి వినిపించాడు. జపాన్‌లో ఈ తరహా వివాహాలకు చట్టపరమైన గుర్తింపు లేనప్పటికీ, వర్చువల్ క్యారెక్టర్లతో బంధాలు ఏర్పరుచుకునే వారి సంఖ్య పెరుగుతోంది. అక్కడి యువతలో 'ఫిక్టోరొమాంటిక్' (కాల్పనిక పాత్రలతో ప్రేమ) సంబంధాల పట్ల ఆసక్తి పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. మానవ సంబంధాలకు ఓపిక అవసరమని, కానీ ఏఐతో అలాంటి అవసరం లేకపోవడమే ఈ ధోరణికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఈ బంధం తనను వాస్తవ ప్రపంచం నుంచి దూరం చేసేది కాదని, తన జీవితానికి మద్దతుగా నిలిచే తోడు మాత్రమేనని నోగుచి చెప్పింది. 'క్లాస్'తో బంధం మొదలయ్యాక తన మానసిక ఆరోగ్యం మెరుగుపడిందని, జీవితం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడిందని పేర్కొంది.

## తండ్రితో లొల్లి.. పీవోకే నుంచి భారత్‌కు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు చెందిన ఒక మహిళ తండ్రితో గొడవపడి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి భారత్‌లోకి ప్రవేశించింది. నియంత్రణ రేఖను దాటి జమ్ము కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోకి వచ్చిన ఆమెను భారత ఆర్మీ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆ మహిళను పాకిస్థాన్‌లోని కోట్లి ప్రాంతానికి చెందిన షెహ్నాజ్ అక్తర్ (35)గా గుర్తించారు. సరిహద్దులోని బాలాకోట్ సెక్టార్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో ఆమె తన తండ్రితో గొడవపడి ఇంటి నుంచి పారిపోయి ఎల్‌ఓసీ మీదుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు చెప్పిందని అధికారులు వెల్లడించారు. భారత్‌లో అక్రమంగా ప్రవేశించడానికి ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ అనంతరం ఆ మహిళను పోలీసులకు అప్పగిస్తామని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు.

## నెహ్రూ లేఖలు వెనక్కివ్వండి

**సోనియా గాంధీకి కేంద్రం సూచన**

న్యూఢిల్లీ: భారత తొలి ప్రధాని నెహ్రూకు సంబంధించిన లేఖలు, కార్టూన్లు సోనియా గాంధీ వ్యక్తిగత ఆస్తులు కావని, అవి దేశ ఆస్తి కాబట్టి వాటిని తిరిగి అప్పగించాలని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ డిమాండ్ చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య వివిధ అంశాలపై వాడి వేడిగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో జవహర్ లాల్ నెహ్రూ లేఖలకు సంబంధించి బుధవారం బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మధ్య వాగ్యుద్ధం జరిగింది. నెహ్రూ లేఖలు తిరిగి ఇచ్చేయాలని, అవి గాంధీ కుటుంబం ఆస్తులు కావని సాంస్కృతిక శాఖ సోనియా గాంధీకి స్పష్టం చేసింది. అంతకుముందు, నెహ్రూకు సంబంధించిన లేఖలు ఎక్కడున్నాయని, వాటి ఆచూకీ లేకుండా చేసినందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతల డిమాండ్‌పై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పందించారు. ప్రైమ్ మినిస్టర్ మ్యూజియం, లైబ్రరీ నుంచి నెహ్రూ లేఖలు అదృశ్యం కాలేదని స్పష్టం చేశారు. 2008 ఆగస్ట్ 29వ తేదీతో కూడిన ఉత్తరంలో సోనియా గాంధీ ప్రతినిధి ఎంవీ రాజన్ నెహ్రూకు సంబంధించిన వ్యక్తిగత ఉత్తరాలను, నోట్స్‌ను ఆమె తిరిగి తీసుకునేందుకు అనుమతించాలని కోరారని తెలిపారు. ఈ లేఖ ఆధారంగా నెహ్రూ వ్యక్తిగత పత్రికల్లో ముద్రితమైన 51 కార్టూన్లను 2008లో సోనియా గాంధీకి అప్పగించారని అర్థమవుతోందని తెలిపారు. సోనియా కార్యాలయం నుంచి వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు పీఎంఎంఎల్ ప్రయత్నిస్తోంది. ఈ విషయమై ఈ సంవత్సరం రెండుసార్లు సోనియా గాంధీకి లేఖలు రాశామని అన్నారు. ఆ లేఖలు అదృశ్యం కాలేదని, అవి ఎవరి దగ్గర ఉన్నాయో తమకు తెలుసని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆ లేఖలను అప్పగించాలని ఆయన సోనియాకు విజ్ఞప్తి చేశారు. నెహ్రూ లేఖలు, కార్టూన్లను ఎందుకు తిరిగివ్వడం లేదో దేశ ప్రజలకు చెప్పాలని సోనియా గాంధీని కేంద్ర మంత్రి 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. వాటిని మీ వద్ద ఎందుకు అట్టిపెట్టుకున్నారని, అందులో ఉన్న రహస్యాలేమిటని ప్రశ్నించారు. ఎంతో ముఖ్యమైన చారిత్రక డాక్యుమెంట్లు ఇంకా ప్రజలకు ఎందుకు అందుబాటులో లేకుండా పోయాయని అన్నారు. అవి మీ కుటుంబ వ్యక్తిగత పత్రికలు కాదని తేల్చిచెప్పారు.

## బంగ్లాదేశ్‌లో భారత వీసా కేంద్రం మూసివేత

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఉన్న భారత వీసా దరఖాస్తుల కేంద్రాన్ని భద్రతా కారణాల రీత్యా తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. కొందరు బంగ్లాదేశ్ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసాంఘిక శక్తుల నుంచి వస్తున్న బెదిరింపుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఢాకాలోని జమునా ఫ్యూచర్ పార్క్‌లో ఉన్న వీసా కేంద్రాన్ని బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసివేస్తున్నట్లు ఐవీఏసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే బుధవారం కోసం షెడ్యూల్ అయిన దరఖాస్తులను మరో తేదీకి మార్చనున్నట్లు వెల్లడించింది. ఇదే సమయంలో, భారత విదేశాంగ శాఖ బంగ్లాదేశ్ హైకమిషనర్ ముహమ్మద్ రియాజ్ హమీదుల్లాకు సమన్లు జారీ చేసింది. ఢాకాలోని భారత హైకమిషన్ వద్ద ఉద్రిక్తతలు సృష్టించేందుకు కొన్ని తీవ్రవాద శక్తులు కుట్ర చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. తమ దౌత్య సిబ్బంది, కార్యాలయాలకు భద్రత కల్పించడం బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. మరోవైపు, ఢాకాలో నిరసనకారులు భారత హైకమిషన్ వైపు భారీ మార్చ్ నిర్వహించారు. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు దేశం విడిచి వెళ్లిన వారిని అప్పగించాలని డిమాండ్ చేశారు. అయితే పోలీసులు వారిని మధ్యలోనే అడ్డుకున్నారు. బంగ్లాదేశ్‌లో కొన్ని శక్తులు భారత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. బంగ్లాదేశ్ ప్రజలతో భారత్‌కు చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని, వాటిని మరింత బలోపేతం చేసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది.

## జనవరి 1 నుండి ఢిల్లీలో 'భారత్ ట్యాక్సీ' యాప్

ప్రైవేటు సంస్థలకు పోటీగా కేంద్రం క్యాబ్ హెయిలింగ్ సేవలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వం భారత్ ట్యాక్సీ యాప్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఊబర్, ఓలా, రాపిడో వంటి ప్రైవేటు సంస్థలు అందిస్తున్న క్యాబ్ హెయిలింగ్ సేవలకు ప్రత్యామ్నాయంగా ఇది రానుంది. కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా కో-ఆపరేటివ్ క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. ఢిల్లీ వాసులకు నూతన సంవత్సర కానుకగా జనవరి 1న భారత్ ట్యాక్సీ సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేంద్రం ప్రకటన చేసింది. ఆ తర్వాత ఈ యాప్ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో ఆటో, క్యాబ్, బైక్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఢిల్లీలో ఈ సేవలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ యాప్ జీరో కమీషన్ మోడల్ ఆధారంగా రూపొందించబడింది. కో-ఆపరేటివ్ లిమిటెడ్ ద్వారా ఈ సహకార ట్యాక్సీ నిర్వహించబడుతుంది. ఢిల్లీవాసులు జనవరి 1 నుంచి ఆటో, ట్యాక్సీ, బైక్ సేవలను ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. వినియోగదారులు వారి మొబైల్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ భారత్ ట్యాక్సీ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. ఇదివరకు ఉన్న క్యాబ్ ఛార్జీల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా, ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండానే ఈ సేవలను పొందే అవకాశముంది. సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చు.

## తొలి మిస్ ఇండియా మెహర్ కాస్టలినో కన్నుమూత

ముంబై: భారత తొలి మిస్ ఇండియా, ప్రఖ్యాత ఫ్యాషన్ జర్నలిస్ట్ మెహర్ కాస్టలినో (81) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమెకు కుమారుడు కార్ల్, కోడలు నిషా, కుమార్తె క్రిస్టినా ఉన్నారు. ముంబైలో జన్మించిన మెహర్, 1964లో ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచారు. అనంతరం మిస్ యూనివర్స్, మిస్ యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ అందాల పోటీలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. మోడలింగ్ తర్వాత ఫ్యాషన్ జర్నలిజంలోకి అడుగుపెట్టి తనదైన ముద్ర వేశారు. 1973లో 'ఈవ్స్ వీక్లీ'లో తొలి కథనంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఫ్యాషన్ కాలమిస్టుగా ఎదిగి, దాదాపు 160 జాతీయ, అంతర్జాతీయ పత్రికలు, మ్యాగజైన్లలో వ్యాసాలు రాశారు. 'మ్యాన్‌స్టైల్', 'ఫ్యాషన్ కెలిడోస్కోప్' వంటి పుస్తకాలు కూడా రచించారు. భారతదేశంలో ఫ్యాషన్ జర్నలిజానికి ఆమెను మార్గదర్శకురాలిగా పరిగణిస్తారు.

వయ్యారి చిత్రం



సోనాల్ తివారీ



## 53 ఏళ్ల వయసులోనూ జాన్ అబ్రహం ఫిట్‌నెస్ కేక!

బాలీవుడ్ యాక్షన్ హీరో జాన్ అబ్రహం నేడు 53వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. యాక్షన్ చిత్రాలకు చిరునామాగా నిలిచే ఆయన, కండలు తిరిగిన శరీరంతో యువతకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తూ ఉంటారు. అయితే, ఈ ఫిజిక్ ఒక్కరోజులో వచ్చింది కాదని, దాని వెనుక ఏళ్ల తరబడి పక్కా ప్రణాళిక, కఠినమైన క్రమశిక్షణ ఉన్నాయని ఆయన స్పష్టం చేస్తుంటారు. జాన్ ఫిట్‌నెస్‌లో 60 శాతం ప్రాధాన్యం ఆహారానిదే. మిగిలిన 40 శాతం మాత్రమే వర్కౌట్‌కు ఇస్తానని చెబుతారు. ఎంత బిజీగా ఉన్నా అల్పాహారం మానకూడదని, గుడ్లు, పండ్లు వంటి పోషకాహారంతో రోజును ప్రారంభించాలని సూచిస్తున్నారు. రోజంతా చిన్న చిన్న మీల్స్ తీసుకోవడం వల్ల మెటబాలిజం చురుగ్గా ఉంటుందని అంటారు. ఖరీదైన డైట్ ప్లాన్‌ల కన్నా, మనం తీసుకునే ఆహారంలో పోషక విలువలు చూసుకోవడం ముఖ్యమని ఆయన నమ్మకం. అన్నం, బ్రెడ్ వంటి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని, వాటిని ఉదయం లేదా మధ్యాహ్నం తీసుకోవాలని చెబుతారు. సెట్‌లో గులాబ్ జామూన్, సమోసాలను కూడా పక్కనపెట్టిన సందర్భాలున్నాయని, స్వీట్స్‌పై నియంత్రణ చాలా అవసరమని జాన్ అంటారు.

## 15 ఏళ్లుగా మోకాలి నొప్పి



టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 66 ఏళ్ల వయస్సు లోనూ ఫిట్ గా కనిపించే ఆయన, గత 15 ఏళ్లుగా ఓ ఆరోగ్య సమస్యతో పోరాడుతున్నట్లు స్వయంగా వెల్లడించారు. తాను తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడుతున్నానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇటీవల ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున, మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. "సుమారు 15 ఏళ్ల క్రితం నాకు మోకాలి నొప్పి మొదలైంది. అప్పటి నుంచి ఈ సమస్యతో బాధపడుతూనే ఉన్నాను. అయితే, ఇప్పటివరకు మోకాలి రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకోలేదు. దాన్ని వీలైనంత వరకు వాయిదా వేయాలనే ప్రయత్నం చేస్తున్నాను" అని ఆయన స్పష్టం చేశారు. మోకాలి నొప్పి నుంచి ఉపశమనం కోసం ల్యూబ్రికెంట్ ఫ్లూయిడ్స్, పీఆర్‌పీ వంటి చికిత్సలు తీసుకున్నట్లు నాగార్జున తెలిపారు. "డాక్టర్ల సహాయంతో మోకాలి లోపల కణజాలం పునరుత్పత్తి అయ్యేలా చూసుకున్నాను. నొప్పి లేని రోజుల్లో కూడా ఉదయాన్నే మోకాలి కోసం ప్రత్యేకంగా రిహాబ్ చేసేవాడిని. నిరంతరం దానిపై దృష్టి పెట్టాను" అని తన క్రమశిక్షణ వెనుక ఉన్న కష్టాన్ని వివరించారు.



## 500 మందికి సోనూసూద్ ఉచిత క్యాన్సర్ చికిత్స

బాలీవుడ్ నటుడు, రియల్ హీరోగా పేరొందిన సోనూ సూద్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. రొమ్ము క్యాన్సర్ తో బాధపడుతున్న 500 మంది మహిళలకు చికిత్స చేయించారు. తన ఫౌండేషన్ ద్వారా ఈ చికిత్సలకు అయిన ఖర్చును భరించామని సోనూ సూద్ తెలిపారు. ఇది ప్రారంభమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని వివరించారు. మహిళలకు రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించడంపైన మరింత దృష్టిసారించినట్లు సోనూ సూద్ పేర్కొన్నారు. 'రొమ్ము క్యాన్సర్ బాధిత మహిళలు 500 మందిని మేం కాపాడగలిగాం. శస్త్రచికిత్సతో వారందరికీ కొత్త జీవితం లభించింది. 500 కుటుంబాలలో ఆనందం నింపినందుకు సంతోషంగా ఉంది. సమష్టి కృషితోనే ఇలాంటి గొప్ప పనులు జరుగుతాయి' అని సోనూసూద్ తెలిపారు. కాగా, కరోనా సమయంలోనూ సోనూ సూద్ పలు దాతృత్వ కార్యక్రమాలు చేసిన విషయం తెలిసిందే. లాక్‌డౌన్ కాలంలో వలస కూలీలను సొంత ఖర్చులతో ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి మరీ స్వస్థలాలకు పంపించి ఆయన రియల్ హీరో అనిపించుకున్నారు.

## ధురందర్ అద్భుతం: ప్రీతి జింటా



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, సినీ ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా ఈ సినిమాను వీక్షించిన ప్రముఖ నటి ప్రీతి జింటా, సోషల్ మీడియా వేదికగా తన అనుభవాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సినిమా ఒక అద్భుతమని, ప్రతి ఒక్కరూ తప్పక చూడాలని ఆమె కోరారు. ఈ విషయంపై ట్విట్టర్‌లో పోస్ట్ పెడుతూ.. "చాలా కాలం తర్వాత ఒంటరిగా థియేటర్‌లో సినిమా చూశాను. మధ్యాహ్నం షో కూడా హౌస్‌ఫుల్ అవ్వడం చూసి ఆశ్చర్యపోయాను. ఈ మధ్యకాలంలో నేను చూసిన అత్యుత్తమ చిత్రాల్లో ఇది ఒకటి. ఎంతో సహజంగా, వాస్తవికంగా ఉంది. ముఖ్యంగా దర్శకుడు ఆదిత్య ధర్ పనితీరు నన్ను కట్టిపడేసింది. ఎంతో కష్టమైన కథను ఆయన గొప్పగా తెరకెక్కించారు" అని ప్రీతి పేర్కొన్నారు. "ఇది కేవలం ఒక సినిమా కాదు. మన దేశాన్ని రక్షించడానికి ప్రాణాలను పణంగా పెట్టే ప్రతి అజ్ఞాత సైనికుడికి, దేశభక్తుడికి రాసిన ప్రేమలేఖ లాంటిది. మూడున్నర గంటల సినిమా క్షణాల్లో గడిచిపోయింది. సినిమా చూశాక నాకు మాటలు రావడం లేదు. దర్శకుడు ఆదిత్యకు ఫోన్ చేసి నా అనుభూతిని పంచుకుంటాను. ఈ కళాఖండాన్ని ప్రేక్షకులు అస్సలు మిస్ అవ్వొద్దు" అని ప్రీతి జింటా తన పోస్టులో రాసుకొచ్చారు. ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఆమె అభినందనలు తెలిపారు.

## టైమ్స్ మ్యాగజైన్ పై ఏంజెలినా


ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హాలీవుడ్ నటి ఏంజెలినా జోలీ తాజాగా మరో సంచలన ఫొటో షూట్ చేశారు. టైమ్స్ మ్యాగజైన్ ఫ్రాన్స్ కవర్ పేజీ కోసం తాను తీసుకున్న రొమ్ము క్యాన్సర్ ముందస్తు చికిత్స గాయాలను బహిర్గతం చేశారు. క్యాన్సర్ ముప్పు నేపథ్యంలో 'మాస్టెక్టమీ' ద్వారా ఏంజెలినా జోలీ తన రెండు రొమ్ములను తొలగించుకున్నారు. ఈ ఆపరేషన్ సందర్భంగా తన ఛాతీపై అయిన గాట్లను (స్కార్స్) తొలిసారి ప్రపంచానికి చూపించారు. తోటి మహిళలకు ధైర్యం ఇచ్చేందుకే ఈ పని చేసినట్లు నటి వెల్లడించారు. ఏంజెలినా జోలీ తల్లి, నటి మార్షెలిన్ బెర్ట్రాండ్ రొమ్ము క్యాన్సర్ బారిన పడి 56 ఏళ్ల వయసులోనే కన్నుమూశారు. ఈ క్యాన్సర్ వంశపారంపర్యంగా తనకూ వచ్చే అవకాశం ఉందని తెలియడంతో ఏంజెలినా జోలీ ముందస్తు చికిత్స తీసుకున్నారు. సుదీర్ఘ సంఘర్షణ తర్వాత మాస్టెక్టమీ ద్వారా రొమ్ములను తొలగించుకున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి, ఆపరేషన్ తర్వాత తాను మానసికంగా చాలా ఇబ్బంది పడినట్లు జోలీ తెలిపారు. ఇప్పటికీ చాలామంది మహిళలు తమకు బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు ఉందని తెలిసినా మాస్టెక్టమీకి సిద్ధపడరని చెప్పారు. వారికి ధైర్యం కల్పించేందుకు, ఆపరేషన్ కోసం వారు ముందుకు వచ్చేలా చేయడానికి తాను ఈ ఫొటోషూట్ కు అంగీకరించానని జోలీ వివరించారు.



## మీకు దండం పెడతా.. ఆ చెత్త వద్దు



ప్రముఖ సినీ నటి శ్రీలీల సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగ విజ్ఞప్తి చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సృష్టిస్తున్న అసభ్యకరమైన, నిరాధారమైన కంటెంట్‌ను దయచేసి ఎవరూ ప్రోత్సహించవద్దని చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆమె ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "టెక్నాలజీని వినియోగించుకోవడానికి, దుర్వినియోగం చేయడానికి చాలా తేడా ఉంది. సాంకేతికత జీవితాన్ని సులభతరం చేయడానికే కానీ, సంక్లిష్టం చేయడానికి కాదని నేను భావిస్తాను" అని శ్రీలీల తన పోస్టులో పేర్కొన్నారు. ఈ రంగంలో ఉన్న ప్రతీ అమ్మాయి కూడా ఎవరో ఒకరికి కూతురు, సోదరి, స్నేహితురాలు అని గుర్తుంచుకోవాలని అన్నారు. తాము సురక్షితమైన వాతావరణంలో ఉన్నామనే భరోసాతోనే చిత్ర పరిశ్రమలో పనిచేయాలని కోరుకుంటున్నామని తెలిపారు. తన పని ఒత్తిడి, షెడ్యూళ్ల కారణంగా ఆన్‌లైన్‌లో జరుగుతున్న చాలా విషయాలు తన దృష్టికి రాలేదని, శ్రేయోభిలాషులు చెప్పడంతోనే ఈ విషయం తెలిసిందని శ్రీలీల వివరించారు. ఫేక్ కంటెంట్ పరిణామం తనను తీవ్రంగా కలచివేసిందని, మానసికంగా కుంగదీసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే తోటి నటీనటులు కూడా ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందరి తరఫున తాను మాట్లాడుతున్నానని అన్నారు. ఈ వ్యవహారాన్ని ఇకపై సంబంధిత అధికారులు చూసుకుంటారని ఆమె స్పష్టం చేశారు. గత అక్టోబర్‌లో మరో ప్రముఖ నటి ప్రియాంక అరుళ్ మోహన్ కూడా తనపై వచ్చిన ఏఐ ఫేక్ ఫోటోల గురించి ఇదే విధంగా స్పందించారు. ఏఐని తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడానికి కాకుండా, సృజనాత్మకతకు వాడాలని ఆమె కోరిన విషయం తెలిసిందే.



# నాలుగో టీ20 మ్యాచ్ రద్దు

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య లక్నోలోని ఎకానా స్టేడియం వేదికగా బుధవారం జరగాల్సి న నాలుగవ టీ20 మ్యాచ్ రద్దయింది. అధిక పొగమంచు కారణంగా మైదానాన్ని పలుమార్లు పరిశీలించిన అనంతరం, మ్యాచ్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో కొనసా గుతోంది. నేటి మ్యాచ్‌లో విజయం సాధించి ఉంటే భారత్ సిరీస్‌ను కైవసం చేసుకునేది. ఒకవేళ దక్షిణాఫ్రికా గెలిచి ఉ ంటే సిరీస్ సమం అయ్యేది. నిర్ణయాత్మక ఐదవ టీ20 మ్యాచ్ ఈ నెల 19న అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు టాస్ వేయాల్సి ఉండగా, పొగమంచు తగ్గుతుందేమోనని రాత్రి 9:30 గంటల వరకు వేచి చూశారు. అంపైర్లు ఐదుసార్లు మైదానాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.



# వచ్చే ఐపీఎల్ తర్వాత రిటైర్మెంట్

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్‌పై ఇక ఎలాంటి అనుమానాలకు తావు లేదని, ఐపీఎల్ 2026 సీజన్ తర్వాత అతను కచ్చితంగా ఆటకు వీడ్కోలు పలుకుతాడని భారత మాజీ ఆటగాడు, ధోనీ సహచరుడు రాబిన్ ఊతప్ప స్పష్టం చేశాడు. సీఎస్‌కే ఫ్రాంచైజీ తమ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకోవడం, అనుభవజ్ఞుల కంటే యువ ఆటగాళ్లపై భారీగా పెట్టుబడులు పెట్టడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నాడు. నిన్న జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో చెన్నై ఈ విషయాన్ని రుజువు చేసింది. 19 ఏళ్ల ప్రశాంత్ వీర్, 20 ఏళ్ల వికెట్ కీపర్-బ్యాటర్ కార్తీక్ శర్మ అనే ఇద్దరు యువ ఆటగాళ్లను చెరో రూ. 14.2 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన అన్‌క్యాప్డ్ భారత ఆటగాళ్లుగా వారు నిలిచారు. ఈ పరిణామాలపై ఊతప్ప మాట్లాడుతూ.. "ఇక గోడ మీద రాత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కచ్చితంగా ధోనీకి చివరి సీజన్ అవుతుంది. అతను మళ్లీ ఆడతాడా? లేదా? అనే ఊహాగానాలకు ఇక చోటు లేదు. ఈ ఏడాదితో అతను పూర్తిగా ఆటకు వీడ్కోలు పలుకుతాడు" అని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం 44 ఏళ్ల ధోనీ, ఆటగాడిగానే కాకుండా మెంటార్‌గా కూడా జట్టును సిద్ధం చేస్తున్నాడని ఊతప్ప అభిప్రాయపడ్డాడు. "ధోనీ ఆడకపోయినా, అతను జట్టుకు మెంటార్‌గా ఉంటాడని మనందరికీ తెలుసు. ఈ ఏడాది అతను ప్లేయర్-కమ్-మెంటార్‌గా వ్యవహరిస్తాడని నేను భావిస్తున్నాను. ఆ కోణంలోనే అతను ఆలోచిస్తున్నాడు. అందుకే ఇలాంటి ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంటున్నారు" అని చెప్పుకొచ్చాడు. గత కొన్ని సీజన్లుగా ధోనీ రిటైర్మెంట్‌పై చర్చ జరుగుతున్నప్పటికీ, అభిమానుల కోసం అతను తన కెరీర్‌ను కొనసాగిస్తూ వచ్చాడు. అయితే, యువతకు పెద్దపీట వేస్తూ సీఎస్‌కే తీసుకుంటున్న తాజా నిర్ణయాలు, ధోనీ శకం ముగింపునకు నాంది పలుకుతున్నాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



## 25 కోట్ల జాక్‌పాట్..
# తెల్లారే డకౌట్



ఐపీఎల్-2026 వేలంలో రికార్డు స్థాయిలో రూ. 25.2 కోట్లు పలికిన ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌కు మరుసటి రోజే మైదానంలో చుక్కెదురైంది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో యాషెస్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల ఖాతా తెరవకుండానే డకౌట్‌గా వెనుదిరిగాడు. ఇవాళ అడిలైడ్ ఓవల్ వేదికగా ప్రారంభమైన మూడో టెస్టు తొలి రోజు ఆటలో ఇలా గ్రీన్ నిరాశపరిచాడు. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వేసిన బౌన్సర్‌తో ఉక్కిరిబిక్కిరైన గ్రీన్, ఆ తర్వాతి బంతికే పెవిలియన్ చేరాడు. ఆర్చర్ విసిరిన బంతిని ఆడేందుకు ప్రయత్నించగా, బ్రైడన్ కార్స్ క్యాచ్ పట్టడంతో సున్నా పరుగులకే అతని ఇన్నింగ్స్ ముగిసింది. ఇక, మంగళవారం అబుదాబిలో జరిగిన ఐపీఎల్ వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు కామెరాన్ గ్రీన్‌ను రూ. 25.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే, వేలంలో తన పేరును మేనేజర్ పొరపాటున బ్యాటర్ల జాబితాలో చేర్చారని, కానీ తాను ఐపీఎల్‌లో తప్పకుండా బౌ లింగ్ చేస్తానని గ్రీన్ గతవారమే స్పష్టం చేశాడు.



# శ్రీలంక ఫీల్డింగ్ కోచ్‌గా ఆర్ శ్రీధర్

భారత క్రికెట్ జట్టు మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్‌కు కీలక బాధ్యతలు లభించాయి. శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) తమ జాతీయ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీధర్‌ను నియమించింది. 2026లో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ ముగిసే వరకు ఈ పదవిలో కొనసాగుతాడు. శ్రీధర్ నియామకం ఈ నెల 11 నుంచి అమల్లోకి రాగా, 2026 మార్చి 10న అతడి ఒప్పందం ముగుస్తుంది. బీసీసీఐ లెవల్ 3 కోచ్ అయిన శ్రీధర్‌కు అంతర్జాతీయ స్థాయిలో విశేష అనుభవం ఉంది. 2014 నుంచి 2021 వరకు ఏడేళ్ల పాటు టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా 300కు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లకు సేవలందించాడు. అతడి హయాంలో భారత జట్టు రెండు వన్డే ప్రపంచకప్‌లు, రెండు టీ20 ప్రపంచకప్‌లు ఆడింది. ఈ నియామకంపై శ్రీధర్ స్పందిస్తూ.. "శ్రీలంక ఆటగాళ్లు సహజమైన ప్రతిభ, పోరాట స్ఫూర్తికి ప్రసిద్ధి. నా పద్ధతులను వారిపై రుద్దకుండా, వారిలో అథ్లెటిసిజం, అవగాహన సహజంగా వృద్ధి చెందే వాతావరణాన్ని కల్పిస్తాను. ఆటగాళ్ల మధ్య సమన్వయం పెంచి, మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ ఇస్తాను" అని తెలిపాడు. రాబోయే పాకిస్థాన్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు టీ20 ప్రపంచకప్‌నకు శ్రీలంక జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలను మెరుగుపరచడంపై శ్రీధర్ దృష్టి సారించనున్నాడు. కాగా, ఈ ఏడాది మే నెలలోనే అతడు శ్రీలంక హై పర్ఫార్మెన్స్ సెంటర్‌లో 10 రోజుల పాటు ప్రత్యేక ఫీల్డింగ్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించడం గమనార్హం. గతంలో ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా కూడా పనిచేశాడు.

# గాయంతో గిల్ అవుట్

దక్షిణాఫ్రికాతో జరగనున్న చివరి టీ20 మ్యాచ్ నుంచి భారత వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వైదొలిగాడు. ఐదు టీ20ల సిరీస్‌లో ఇదివరకే మూడు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ప్రస్తుతం భారత్ 2-1 ఆధిక్యంలో కొనసాగుతోంది. అయితే, ఈ మూడు మ్యాచ్‌లలో గిల్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. మొదటి మ్యాచ్‌లో నాలుగు పరుగులు, రెండవ మ్యాచ్‌లో డకౌట్, మూడవ మ్యాచ్‌లో 28 బంతుల్లో 28 పరుగులు మాత్రమే చేశాడు. ఈ క్రమంలో, నెట్ ప్రాక్టీస్ చేస్తుండగా శుభ్‌మన్ గిల్ కాలి బొటన వేలికి గాయమైంది. ఈ కారణంగానే లక్నోలో జరిగే మ్యాచ్‌తో పాటు, అహ్మదాబాద్‌లో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌కు కూడా అతను అందుబాటులో ఉండడని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

# టీ20 ర్యాంకింగ్స్‌లో వరుణ్ నం.1



ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్ సంచలనం వరుణ్ చక్రవర్తి తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచుల్లో రెండేసి వికెట్లు పడగొట్టిన అతడు, కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. తాజాగా వరుణ్ చక్రవర్తి ఖాతాలో అదనంగా 36 రేటింగ్ పాయింట్లు చేరడంతో మొత్తం 818 పాయింట్లతో నెంబర్ 1 స్థానంలో కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ (699) కంటే వరుణ్ 119 పాయింట్ల ఆధిక్యంలో ఉండటం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న దక్షిణాఫ్రికా సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కూడా నాలుగు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంకుకు చేరుకున్నాడు. బౌ లింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ భారత యువ ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ నెంబర్ 1 ర్యాంకును నిలబెట్టుకోగా, తిలక్ వర్మ నాలుగో స్థానానికి చేరుకున్నాడు. దీంతో టీ20 ప్రపంచ కప్ 2026 నాటికి ఇద్దరు భారత బ్యాటర్లు టాప్ 5లో స్థానం సంపాదించారు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ అగ్రస్థానంలో ఉ ండగా, భారత్ నుంచి హార్దిక్ పాండ్యా (4), అక్షర్ పటేల్ (9) టాప్ 10లో ఉన్నారు.



# జైస్వాల్‌కు అస్వస్థత

భారత యువ క్రికెటర్, ముంబై బ్యాటర్ యశస్వి జైస్వాల్ అస్వస్థతకు గురయ్యాడు. పుణెలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా నిన్న రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడటంతో అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మ్యాచ్ జరుగుతున్నంతసేపు కడుపునొప్పితో ఇబ్బందిపడిన జైస్వాల్, ఆట ముగిసిన తర్వాత పరిస్థితి మరింత తీవ్రమవడంతో ఆదిత్య బిర్లా ఆసుపత్రిలో చేర్పించారు. అతడికి అక్యూట్ గ్యాస్ట్రోఎంటరైటిస్ (జీర్ణాశయ సమస్య) అని వైద్యులు నిర్ధారించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అనంతరం మందులు వాడుతూ తగినంత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే ఈ హై-స్కోరింగ్ థ్రిల్లర్‌లో ముంబై మూడు వికెట్ల తేడాతో రాజస్థాన్‌పై అద్భుత విజయం సాధించింది. 217 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జైస్వాల్ 16 బంతుల్లో 15 పరుగులు చేసి ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ అజింక్య రహానే (41 బంతుల్లో 72 నాటౌట్), సర్ఫరాజ్ ఖాన్ (22 బంతుల్లో 73) మెరుపు ఇన్నింగ్స్‌లతో ముంబైని గెలిపించారు. ముఖ్యంగా సర్ఫరాజ్ తన ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లు, ఆరు ఫోర్లతో విధ్వంసం సృష్టించాడు.





## విద్యార్థుల చిన్నారుల

# ప్రాణాలకు విలువేది?

విద్యా రంగంలో తెలంగాణ అగ్రగామిగా ఉండాలని ఆశిస్తున్న తరుణంలో, ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్ల నుండి వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. నాణ్యమైన చదువు, పౌష్టికాహారం అందుతుందని నమ్మి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పిస్తే, అక్కడ వారికి పురుగుల అన్నం, కలుషిత ఆహారం దర్శనమివ్వడం అత్యంత దురదృష్టకరం.

**గత కొన్ని నెలలుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో పదుల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. వందల మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.**

ఒక ఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం, విచారణకు ఆదేశించడం తప్ప, శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడటం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి హాస్టల్ గదులు అనారోగ్య నిలయాలుగా మారుతున్నాయి. గురుకులాల నిర్వహణ కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందుతున్న ఆహారం మాత్రం దయనీయంగా ఉంది. కుళ్ళిన కూరగాయలు, నిల్వ ఉంచిన పదార్థాలు, అపరిశుభ్రమైన వంటశాలలు చిన్నారుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఆహార నాణ్యతను తనిఖీ చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారనేది సమాధానం లేని ప్రశ్న. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలపై చూపే శ్రద్ధను ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై చూపాలి. కేవలం పైపైన తనిఖీలు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, వంట మనుషుల నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు బాధ్యులను చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. డైట్ ఛార్జీల పెంపుతో పాటు, ప్రతి హాస్టల్‌లో శుద్ధమైన తాగునీరు, నాణ్యమైన భోజనం అందేలా చూడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. పేద విద్యార్థుల కలల సౌధాలుగా ఉండాల్సిన గురుకులాలు, భయాందోళనల కేంద్రాలుగా మారడం ప్రభుత్వ వైఫల్యమే. మంత్రులు, ఉన్నతాధికారులు కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను చక్కదిద్దాలి. లేదంటే, ఈ విష సంస్కృతి రేపటి తరాన్ని నిర్వీర్యం చేస్తుంది.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**




# బీఆర్ఎస్

## పట్టు పెరుగుతోంది!

తెలంగాణ పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, సంఖ్యాపరంగా కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం లభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ కనబరిచిన ఫలితాలు ఆసక్తికరం.

**ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పెరుగుతున్న అసహనానికి నిదర్శనం అని భావించవచ్చు. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేక డీలా పడిన బీఆర్ఎసన్ పని అయిపోయిందని చాలా మంది భావించారు.**

కానీ, తాజాగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఆ అంచనాలను తలకిందులు చేశాయి. అధికారంలో ఉన్న పార్టీ సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 80–90 శాతం స్థానాలను ఏకపక్షంగా గెలుచుకోవడం ఆనవాయితీ. అయితే, రేవంత్ రెడ్డి




నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న తరుణంలో జరిగిన ఈ ఎన్నికల్లో, బీఆర్ఎస్ గట్టి పోటీ ఇవ్వడం గమనించాల్సిన అంశం. మొత్తం మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు దాదాపు 3,500కు పైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకుని, తాము ఇంకా బలమైన రాజకీయ శక్తిగానే ఉన్నామని నిరూపించుకున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల వంటి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఏకపక్ష విజయాలను సాధించడం, కాంగ్రెస్ మంత్రుల సొంత జిల్లాల్లోనూ గట్టి పోటీ ఇవ్వడం గులాబీ పార్టీకి కొత్త ఊపిరినిచ్చింది. అధికార పార్టీ ప్రలోభాలను, అధికార యంత్రాంగాన్ని తట్టుకుని మరీ ఈ ఫలితాలు సాధించడం అంటే, గ్రామీణ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత మొదలైందనే వాదనకు బలం చేకూరుతోంది. ఆరు గ్యారంటీల అమలులో జాప్యం, రైతు రుణమాఫీలో తలెత్తిన సమస్యలు, రైతు భరోసా వంటి పథకాలపై స్పష్టత లేకపోవడం పల్లె ఓటర్లను ఆలోచింపజేసినట్లు కనిపిస్తోంది. 'అధికారం ఉంది కదా అని ఏది చేసినా చెల్లుతుంది' అనే ధోరణికి ఈ ఫలితాలు చెక్ పెట్టాయి. కేవలం ఏడాది కాలంలోనే ప్రధాన ప్రతిపక్షం ఇంత బలంగా పుంజుకోవడం ప్రభుత్వ వైఫల్యమే. పంచాయతీ ఫలితాలు బీఆర్ఎస్‌కు నైతిక విజయాన్ని, కాంగ్రెస్‌కు ప్రమాద హెచ్చరికను అందించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజల అసంతృప్తిని గుర్తించి, హామీల అమలుపై దృష్టి సారించకపోతే, రాబోయే స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికల్లో మరింత గట్టి షాక్ తప్పకపోవచ్చు.

**- ఎండీ షంషుద్దీన్, సీనియర్ పొలిటికల్ అనలిస్ట్**

# రాజ్యాంగం నవ్వుల పాలు



ఫిరాయింపుల వ్యవహారంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న తాజా నిర్ణయం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రశ్నార్థకం చేసేలా ఉంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవి అత్యంత పవిత్రమైనది. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలోకి మారే 'ఫిరాయింపుల' జాడ్యాన్ని అరికట్టేందుకు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (ఫిరాయింపు నిరోధక చట్టం) స్పీకర్‌కు విశేష అధికారాలను కల్పించింది. అయితే, తెలంగాణలో ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుసరించిన వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా ఉంది. ఓటర్ల తీర్పును కాలరాస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం నైతికంగా ఎంత తప్పో, చట్టపరంగా కూడా అంతే నేరం. గత పదేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో ఫిరాయింపుల పర్వం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. కోర్టులు మొట్టికాయలు వేసినా, గడువు విధించినా.. స్పీకర్ కార్యాలయం నిర్ణయం తీసుకోవడంలో తాత్సారం చేయడం ఒక ఆనవాయితీగా మారిపోయింది. తాజా నిర్ణయం కూడా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించకపోవడం వల్ల, వారు చట్టసభల్లో కొనసాగుతూ అధికార యంత్రాంగంలో భాగస్వామ్యం పొందడం రాజ్యాంగాన్ని నవ్వుల పాలు చేయడమే. రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉండాల్సిన స్పీకర్, రాజకీయ ప్రయోజనాలకు తలొగ్గినట్లు కనిపిస్తే అది వ్యవస్థకే ప్రమాదం. చట్టంలోని లొసుగులను వాడుకుంటూ ప్రజా తీర్పును వెక్కిరించడం ఇకనైనా ఆగాలి. ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి కేన్సర్ లాంటివి. ఈ విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయాలు ఒక వ్యవస్థ పునాదులను నిర్ణయించేవి. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా, రాజ్యాంగ ధర్మాన్ని పాటించి ఫిరాయింపుదారులపై కఠిన నిర్ణయం తీసుకోవాలి. లేదంటే, భవిష్యత్ తరాలకు అప్రజాస్వామిక సంప్రదాయాన్ని వారసత్వంగా ఇచ్చినట్లు అవుతుంది.



**- నవీన్ పోగుల, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల ఫోరం ప్రధాన కార్యదర్శి**

## రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ అవమానం

రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుంగలో తొక్కింది. దానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వంత పాడారని స్పష్టంగా అర్థం అవుతోంది. ఫిరాయింపులకు పాల్పడినట్లు సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డిలపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వాస్తవానికి, 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ రాజకీయ స్వచ్ఛత కోసం 10వ షెడ్యూల్ ద్వారా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఒకవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతుంటే, మరోవైపు తెలంగాణలో ఆయన తండ్రి తీసుకొచ్చిన చట్టాన్నే కాలరాయడం ఎంత వరకు సమంజసం. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గతంలో గడువు విధించినప్పటికీ, సరైన ఆధారాలు లేవనే సాకుతో పిటిషన్లను తోసిపుచ్చడం కోర్టులను అవమానించడమే అవుతుంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.